www.prajanaava.in

Telugu Daily

ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00



దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రజానావ తెలుగు దినపత్రిక కార్యాలయానికి ఆదివారం సెలవు. సోమవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం మంగళవారం. – ఎడిటర్

Published from: **Karimnagar, Rangareddy, Hyderabad** Circulated to: **Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

కరీంనగర్ | సంపుటి 04 | సంచిక: 49 | ఆదివారం | 8 నవంబర్, 2026


వెలుగుల పండుగ..
మీ జీవితాల్లో ఆనందాలు నింపాలి

నమ్మకాన్ని వెలుగుగా.. పాఠకుల ఆదరణను కొండంత బలంగా చేసుకుని ప్రజానావ దినపత్రిక నాలుగో ఏడాదిలోకి విజయవంతంగా పరుగులు పెడుతోంది. ఈ సుదీర్ఘ ప్రయాణంలో మాకు అండగా నిలిచిన పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులందరికీ హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు. ఈ దీపాల పండుగ మీ ఇళ్లలోనే కాదు.. మీ మనసుల్లోనూ కొత్త ఆశల వెలుగులు నింపాలి. ప్రతి గడప ఆనందంతో కళకళలాడాలి.. ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సిరిసంపదలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలి. మీ అభిమానం, ఆదరణే మా అక్షర ప్రయాణానికి అనలేన వెలుగు. ఇదే నమ్మకంతో మరింత బాధ్యతగా, మరింత నిబద్ధతతో ప్రజల గొంతుకగా ముందుకు సాగుతామని హామీ ఇస్తూ.. మరోసారి అందరికీ దీపావళి శుభాకాంక్షలు.



ఏదుల తిరుపతి
ఎడిటర్

ఎమర్జెన్సీ తప్పే!



న్యూఢిల్లీ: దేశంలో అత్యయిక స్థితి (ఎమర్జెన్సీ) విధించడం పొరపాటేనని కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ అంగీకరించారు. తన అత్త, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ కూడా ఆ నిర్ణయాన్ని తప్పుగానే భావించి ఉంటారని అభిప్రాయపడ్డారు. ఎమర్జెన్సీ విధించిన అనంతరం చోటుచేసుకున్న పరిణామాల్లో చాలా వరకు, సంజయ్ గాంధీని అదుపులో ఉంచి ఉంటే నివారించగలిగేవారమని వ్యాఖ్యానించారు. తన ఆత్మకథ పుస్తక రూపంలో విడుదల కానున్న నేపథ్యంలో ఓ బ్రిటిష్ దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ విషయాలు వెల్లడించారు. ఎమర్జెన్సీ నిర్ణయాన్ని రాజీవ్ గాంధీ తీవ్రంగా వ్యతిరేకించారని సోనియా తెలిపారు. వచ్చే ఎన్నికల వరకు వేచి చూడాలని ఆయన తల్లికి సూచించినప్పటికీ, సంజయ్ గాంధీ మాత్రం ప్రతిపక్షాలను కట్టడి చేయాలని పట్టుబట్టారని చెప్పారు. ఇందిర చుట్టూ ఉన్న వారిలో రాజీవ్‌లా భిన్నంగా ఆలోచించి అభిప్రాయాలు చెప్పేవారు తక్కువగా ఉండేవారని పేర్కొన్నారు. సంజయ్‌ను అదుపులో పెట్టి ఉంటే పరిస్థితులు మరోలా ఉండేవని అభిప్రాయపడ్డారు.

ఆమె కూడా ఒత్తిడికి గురయ్యారు

ఇందిరాగాంధీ ప్రజాస్వామ్యవాది అని తాను భావిస్తానని, ఎమర్జెన్సీ సమయంలో ఆమె కూడా తీవ్ర ఒత్తిడికి గురయ్యారని సోనియా పేర్కొన్నారు. ఈ విషయాలు చెబితే చాలామంది నవ్వుతారని తెలిసినా, నాటి పరిణామాలు ఆమెపై భారంగా మారాయని వివరించారు. 'ది హిందూ'కు ఇచ్చిన మరో ఇంటర్వ్యూలోనూ సోనియా ఇదే తరహా అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఎమర్జెన్సీ విధించిన తర్వాతే ప్రజాస్వామ్య హక్కులపై ఆంక్షలు, హెబియస్ కార్పస్ హక్కు నిలిపివేత వంటి పరిణామాల తీవ్రత తనకు అర్థమైందన్నారు. అయితే, ఆ చర్యలన్నీ రాజ్యాంగ నిబంధనల ప్రకారమే జరిగాయని స్పష్టం చేశారు.



ఆరుతడి మేలు

- నీటి లభ్యతను బట్టి పంటలు సాగు చేయాలి
- రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తలెత్తే అవకాశం
- ప్రాజెక్టుల్లోని నీళ్లు తాగునీటికే సరిపోతాయి
- ఎండల తీవ్రత పెరిగే ప్రమాదం.. రైతులు జాగ్రత్తగా ఉండాలి
- ఎల్‌నినోపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు
- కాళేశ్వరం, ఎల్‌నినోపై చర్చకు సిద్ధం
- డిసెంబరులో స్పీకర్ ప్రత్యేక అసెంబ్లీని సమావేశ పరచాలి
- భూములు కోల్పోయే రైతులకు ఎకరాకు రూ.20 లక్షల వరకు పరిహారం
- సంక్రాంతి తర్వాత అన్ని జిల్లాల్లో పర్యటిస్తా
- కొడంగల్ అభివృద్ధికి భారీ ప్రణాళికలు • కాళేశ్వరం, ఎల్‌నినోపై చర్చకు సిద్ధం
- కొడంగల్ వేదికగా బీఆర్ఎస్‌కు సీఎం రేవంత్ రెడ్డి సవాల్

ప్రజానావ, కొడంగల్: ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ప్రాజెక్టుల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీరు తాగునీటి అవసరాలకే సరిపోతుందని, రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరగవచ్చని తెలిపారు. రైతులు వరి వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. ఎల్‌నినోపై బీఆర్ఎస్ నేతల ప్రచారాన్ని నమ్మి నష్టపోవద్దని కోరారు. సంక్రాంతి తర్వాత అన్ని జిల్లాల్లో పర్యటిస్తానని ప్రకటించారు. మూడు రోజుల కొడంగల్ పర్యటనలో భాగంగా శనివారం హకీంపేట, దుద్యాల మండలాల్లో రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభించిన సీఎం.. పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. హకీంపేటలో 250 ఎకరాల్లో నిర్మిస్తున్న ఎడ్యుకేషన్ హబ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌పై విమర్శలు చేశారు. ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉంటే తెలంగాణలోనే కరువు వచ్చినట్లు ఆ పార్టీ నేతలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మేడిగడ్డ బ్యారేజీలో 16 టీఎంసీల నీరు ఉంటేనే కన్నెపల్లి నుంచి ఎత్తిపోసుకునే అవకాశం ఉంటుందని రేవంత్ వివరించారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లు దించే పరిస్థితి కూడా లేదన్నారు. బీఆర్ఎస్ అవినీతి కారణంగానే మూడు బ్యారేజీలు నిరుపయోగంగా మారాయని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన దేవాదుల, వైఎస్సార్ ప్రారంభించిన ప్రాజెక్టులే ప్రస్తుతం రైతులకు, ఖమ్మం జిల్లాకు అండగా ఉన్నాయని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ పాలనలోనే కూలిన కాళేశ్వరం

పాలమూరు నుంచి గెలిచిన కేసీఆర్ భారీగా నిధులు ఖర్చు చేసినా అక్కడి ప్రాజెక్టులను పూర్తి చేయలేదని విమర్శించారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును పక్కనపెట్టి పేరు, స్థలం, అంచనాలు మార్చి చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్ పాలనలోనే కూలిపోయిందని ఆరోపించారు. ఎల్‌నినో, కాళేశ్వరం అంశాలపై చర్చించేందుకు వచ్చే డిసెంబరులో ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని స్పీకర్‌ను కోరుతున్నట్లు వెల్లడించారు. కొడంగల్–నారాయణపేట–మక్తల్ ఎత్తిపోతల పథకం అంచనాల పెంపుపై కేటీఆర్ విమర్శలను సీఎం తిప్పికొట్టారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొడంగల్ ప్రాంతానికి ఏం చేశారని ప్రశ్నించారు. గతంలో ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.2 లక్షల పరిహారం ఇచ్చేందుకు కూడా అప్పటి ప్రభుత్వం ముందుకు రాలేదని, తమ ప్రభుత్వం మాత్రం ఎకరాకు రూ.20 లక్షల వరకు పరిహారం అందిస్తోందని చెప్పారు. హైదరాబాద్–లగచర్ల ప్రాంతాన్ని ఢిల్లీ–నోయిడా తరహాలో అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, పెట్టుబడులకు పెద్ద కంపెనీలు ముందుకొస్తున్నాయని తెలిపారు.

వేషభాషలు మార్చుకుంటే ప్రజలు నమ్మరు

కేటీఆర్ వేషభాషలు మార్చుకున్నా ప్రజలు నమ్మరని, గడ్డం పెంచుకున్నంత మాత్రాన తనలా మారలేరని రేవంత్ వ్యాఖ్యానించారు. తాను మూడేళ్లుగా ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నానని చెప్పారు. సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఇప్పటికే తమ తీర్పు ఇచ్చారని, అబద్ధపు ప్రచారాలు చేస్తున్న కుటుంబాన్ని ప్రజలు బహిష్కరించాలని పిలుపునిచ్చారు.

ఏదుల నుంచి డిండికి నీళ్లు సాధ్యం కాదు





(మొదటిపేజీ తరువాయి)

చేశారు. సర్వేలు, ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండా ప్రకటనలు చేయడం సరికాదన్నారు. గతంలో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు శ్రీశైలాన్ని సోర్స్ పాయింట్‌గా నిర్ణయించడమూ తప్పేనని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత అవసరమైన ప్రాజెక్టులను పూర్తి చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని, అప్పటి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నందుకు క్షమాపణ కోరుతున్నానని చెప్పారు.

గోదావరి నీటితోనే డిండికి జలాలు

కాళేశ్వరం అదనపు టీఎంసీ నీటిని బస్వాపూర్ మీదుగా డిండి ఎత్తిపోతలకు తరలించడమే సరైన మార్గమని కవిత వివరించారు. బస్వాపూర్ రిజర్వాయర్ పనులు 80 శాతం పూర్తయ్యాయని, వాటిని పూర్తి చేస్తే డిండికి నీటిని తరలించడం సులభమవుతుందన్నారు. శివన్నగూడెం, కిష్టరాయపల్లి పనులు పూర్తికాకపోయినా మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలను తీసుకురావచ్చని, ఉల్పరకు కూడా బస్వాపూర్ నుంచి నీటిని తరలించే అవకాశముందని చెప్పారు. కొండ పోచంపల్లి నుంచి షామీర్‌పేట చెరువు మీదుగా శివన్నగూడెంకు నీటిని తీసుకురావచ్చని పేర్కొన్నారు. గోదావరి–కృష్ణా అనుసంధానం ద్వారానే ఉమ్మడి నల్గొండ నీటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. గోదావరి–కావేరి నదుల అనుసంధానాన్ని తుపాకులగూడెం వద్దే చేపట్టాలని, పోలవరం వద్ద చేపట్టాలన్న ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనకు అంగీకరించబోమని కవిత పేర్కొన్నారు. ఏటా గోదావరి నుంచి సుమారు 3,500 టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తున్నా వాటిని సద్వినియోగం చేసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మేడిగడ్డ వద్ద కన్నెపల్లి పంపుహౌస్‌ను వినియోగించుకునే అవకాశం ఉన్నా, దానిని పక్కనపెట్టి తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రతిపాదన తీసుకురావడంపై ప్రశ్నించారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులను ముందుగా పూర్తి చేయాలని కవిత ప్రభుత్వాన్ని కోరారు. బస్వాపూర్ పనులను పక్కనపెట్టి గంధమల్ల పనులు ప్రారంభించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. డబ్బు, పేరు కోసం ప్రజలకు నష్టం కలిగించవద్దని సూచించారు. తాము అధికారంలోకి వస్తే ముందుగా అసంపూర్తి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చెప్పారు. సమస్యలపై పోరాడటంతోపాటు పరిష్కార మార్గాలను కూడా తమ పార్టీ సూచిస్తోందని పేర్కొన్నారు.

నల్గొండలో చిన్న రిజర్వాయర్లు నిర్మిస్తాం

ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఇటీవల మరోసారి ఫ్లోరైడ్ కేసు నమోదవడం ఆందోళన కలిగించిందని కవిత అన్నారు. ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించాలంటే నాలుగు దశాబ్దాలపాటు ఈ ప్రాంత భూములకు నదీ జలాలు అందించాలని పేర్కొన్నారు. జూరాల నుంచి శ్రీశైలం వరకు సుమారు 200 కిలోమీటర్ల పరిధిలో ఒక్క ప్రాజెక్టు కూడా నిర్మించకపోవడం అన్యాయమన్నారు. తాము అధికారంలోకి వస్తే నల్గొండ జిల్లాలో చిన్నచిన్న రిజర్వాయర్లు నిర్మిస్తామని ప్రకటించారు. డిండి ప్రాజెక్టుకు ఏదుల నుంచి నీళ్లు తీసుకురావడం సాధ్యం కాదని ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి తెలిసినా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉందని, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వాటిపై దృష్టి పెట్టాలని సూచించారు. రైతులు పంటలు వేయవద్దని చెబుతున్న ప్రభుత్వం, వారికి ఇచ్చే పరిహారంపై స్పష్టత ఇవ్వడం లేదని కవిత విమర్శించారు. పంటలు వేయని రైతులకు ఎకరాకు రూ.25వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సన్నబియ్యం అందుబాటులో ఉన్నా ధరలు పెరగడం, మిల్లర్ల అవినీతిలో కాంగ్రెస్ పార్టీకి సంబంధాలున్నాయన్న ఆరోపణలపైనా స్పందించారు. రేవంత్‌రెడ్డిని రేసుగుర్రంలా భావించి అవకాశం ఇస్తే, ఆయన కీలు గుర్రంలా మారారని వ్యాఖ్యానించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన బీఆర్ఎస్ కూడా ప్రజా సమస్యలపై స్పందించడం లేదని విమర్శించారు. రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులకు మద్దతివ్వాలని కోరారు.

ఎత్తిపోతల టెండర్లలో భారీ దోపిడీ

- పొంగులేటి కంపెనీకి అనుచిత లబ్ధి చేకూర్చారు
- రూ.1,450 కోట్ల ప్రాజెక్టు అంచనా రూ.6,825 కోట్లకు పెంపు
- రైతులకు చుక్క నీరివ్వకుండానే ఐదు రెట్లు వ్యయం పెంచారు
- ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు

ప్రజానావ, హైదరాబాద్: కొడంగల్–నారాయణపేట–మక్తల్ ఎత్తిపోతల పథకం టెండర్లలో భారీ అక్రమాలు జరిగాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన కంపెనీకి అనుచితంగా లబ్ధి చేకూర్చేలా టెండర్ల ప్రక్రియను రూపొందించారని విమర్శించారు. 2014లో సుమారు రూ.1,450 కోట్లుగా ఉన్న ఈ ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని ప్రస్తుతం రూ.6,825 కోట్లకు పెంచడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రైతులకు కనీసం చుక్క నీరు అందకముందే వ్యయాన్ని దాదాపు ఐదు రెట్లు పెంచి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. టెండర్లలో పొంగులేటికి చెందిన కంపెనీ ప్రధాన పోటీదారుగా ఉండగా, మిగతా సంస్థలు నామమాత్రపు పోటీదారులుగా ఉన్నాయని కేటీఆర్ ఆరోపించారు. తమకు అనుకూలమైన సంస్థలకు పనులు అప్పగించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకత లేని విధానాలను అనుసరిస్తోందని విమర్శించారు. ఈ వ్యవహారంపై వ్యంగ్యంగా స్పందించిన ఆయన.. 'క్రోనీ క్యాపిటలిజం, పగటి దోపిడీ వంటి పదాలు కూడా ఈ వ్యవహారాన్ని వర్ణించడానికి సరిపోవడం లేదు. రాహుల్‌గాంధీ గారూ.. ఈ దోపిడీని వివరించడానికి కొత్త పదం వెతికేందుకు దయచేసి నాకు సహకరించండి' అంటూ వ్యాఖ్యానించారు. ప్రాజెక్టుల పేరుతో అంచనాలు పెంచుతూ ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారని కేటీఆర్ ఆరోపించారు.

13,629 అడుగుల ఎత్తులో విమానం ల్యాండింగ్!

- న్యోమా స్థావరంలో సురక్షితంగా దిగిన ఐఎల్–76ఎండీ
- ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో ల్యాండయిన విమానంగా రికార్డు
- చారిత్రక ఘట్టంగా అభివర్ణించిన వాయుసేన



న్యూఢిల్లీ: భారత వైమానిక దళం విమానయాన చరిత్రలో అరుదైన ఘనత సాధించింది. రష్యా తయారీ భారీ రవాణా విమానం ఐఎల్–76ఎండీ లద్దాఖ్‌లోని 13,629 అడుగుల ఎత్తులో ఉన్న న్యోమా వైమానిక స్థావరంలో విజయవంతంగా ల్యాండ్ అయింది. ప్రపంచంలో ఈ తరహా విమానం ఇంత ఎత్తులో దిగడం ఇదే తొలిసారని వాయుసేన 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. విమానం అసాధారణ సామర్థ్యంతో పాటు పైలట్లు, సిబ్బంది నైపుణ్యం, కచ్చితత్వానికి ఈ విజయం నిదర్శనమని పేర్కొంది. దేశ వ్యూహాత్మక వాయు రవాణా సామర్థ్యాన్ని బలోపేతం చేసే చారిత్రక ఘట్టంగా అభివర్ణించింది. చైనాతో వాస్తవ నియంత్రణ రేఖ (ఎల్‌ఏసీ)కు సుమారు 25 కిలోమీటర్ల దూరంలో న్యోమా వైమానిక స్థావరం ఉంది. గత ఏడాది నవంబరులో అందుబాటులోకి వచ్చిన ఈ స్థావరంలో యుద్ధ విమానాలు, హెలికాప్టర్ల రాకపోకలకూ అవకాశం ఉంది. లేహ్, కార్గిల్, థోయిస్ తర్వాత లద్దాఖ్ ప్రాంతంలో ఇది నాలుగో వైమానిక స్థావరం. సరిహద్దుల్లో సైనిక అవసరాల దృష్ట్యా ఎల్‌ఏసీ వెంబడి ఉన్న అడ్వాన్స్‌డ్ ల్యాండింగ్ గ్రౌండ్స్ సహా కీలక వైమానిక స్థావరాల్లో రక్షణశాఖ మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తోంది. సముద్రమట్టానికి 16,700 అడుగుల ఎత్తులో ఉన్న ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన వైమానిక స్థావరంగా పేరొందిన దౌలత్ బేగ్ ఓల్డీ (డీబీఓ)లోనూ సౌకర్యాలను అభివృద్ధి చేస్తోంది.

ఈ20 కాదు.. 420!

- పెట్రోల్‌లో 30శాతానికి పైగా ఇథనాల్ కలుపుతున్నారంటూ రాహుల్ ఆరోపణ
- 14 నమూనాల్లో 11లో అధిక ఇథనాల్ ఉన్నట్లు పరీక్షల్లో గుర్తింపు
- ఆరోపణలను తోసిపుచ్చిన చమురు సంస్థలు.. నిబంధనల ప్రకారమే విక్రయాలని స్పష్టీకరణ

న్యూఢిల్లీ: పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమం నిర్దేశిత పరిమితిని మించి ఉంటోందంటూ కర్ణాటకలో వచ్చిన ఆరోపణలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకున్నారు. 'ఈ20 కార్యక్రమం కాస్తా 420గా మారింది' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. వాహనదారుల పెట్రోల్‌ను దొంగిలించడమే ఇదని మండిపడ్డారు. నిర్దేశించిన పరిమితికి మించి ఇథనాల్ కలిపిన ఇంధనాన్ని ప్రభుత్వ, ప్రైవేటు చమురు సంస్థలు విక్రయిస్తున్నాయని ఆరోపించారు. కర్ణాటకలోని బెంగళూరు, కోలారు, చిక్కబళ్లాపుర, బెంగళూరు గ్రామీణం, రామనగర, మంగళూరు, తుమకూరు తదితర ప్రాంతాల నుంచి సేకరించిన 14 ఇంధన నమూనాలను గుర్తింపు పొందిన ప్రయోగశాలలో పరీక్షించగా.. 11 నమూనాల్లో ఇథనాల్ శాతం 20 దాటినట్లు తేలిందని రాహుల్ వెల్లడించారు. కొన్ని నమూనాల్లో ఇది 30.5 నుంచి 31.2 శాతం వరకు నమోదైందని పేర్కొన్నారు. పెట్రోల్ ట్యాంకుల్లో ఏ స్థాయి ఇంధనం నింపుతున్నారో ప్రధాని మోదీ స్పష్టం చేయాలని, పరిమితికి మించి ఇథనాల్ కలుపుతున్న కంపెనీలపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారని ప్రశ్నించారు. ఈ విధానం వల్ల ఎవరికి ప్రయోజనం కలుగుతోందని నిలదీశారు.

30 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్

కర్ణాటకలో ఈ20 పేరుతో 30 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ విక్రయిస్తున్నారని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి రిజ్వాన్ అర్షద్ శుక్రవారం ఆరోపించడంతో వివాదం మొదలైంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం చేసిన వాదనలను ప్రభుత్వ చమురు సంస్థలు ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ సంయుక్తంగా ఖండించాయి. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల ప్రామాణికతపై అభ్యంతరం వ్యక్తం చేశాయి. కేంద్ర ప్రభుత్వ ప్రమాణాల సంస్థ నిర్దేశించిన నిబంధనల ప్రకారం పెట్రోల్‌లో ఇథనాల్ శాతం 19 నుంచి 21 మధ్య ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశాయి.

ఇతరుల జీవితాల్లోనూ వెలుగులు నింపాలి

- దీపావళి అసలైన స్ఫూర్తి ఇదే: గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా • మట్టి ప్రమిదలతో స్వదేశీ కళాకారులకు ప్రోత్సాహం • లోక్‌భవన్‌లో ఉద్యోగులు, కుటుంబ సభ్యులతో ముందస్తు దీపావళి వేడుకలు



ప్రజానావ, హైదరాబాద్: దీపావళి అంటే ఇళ్లలో దీపాలు వెలిగించుకోవడమే కాకుండా, ఇతరుల జీవితాల్లోనూ ఆనంద జ్యోతులు నింపడమేనని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. పేదలు, కష్టాల్లో ఉన్నవారితో సంతోషాలను పంచుకున్నప్పుడే పండుగకు నిజమైన సార్థకత చేకూరుతుందని పేర్కొన్నారు. ప్రేమానురాగాలు, సేవాభావం, పరస్పర సహకారం, సానుకూల ఆలోచనలు, స్వదేశీ సంకల్పంతో దీపావళి జరుపుకోవాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం లోక్‌భవన్‌లో నిర్వహించిన ముందస్తు దీపావళి వేడుకల్లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ఆయన సతీమణి జానకి శుక్లా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో కలసి సందడి చేశారు. అధికారులతో కలిసి బాణసంచా కాల్చి, ఉద్యోగులకు పండుగ కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడిన గవర్నర్.. దీపావళి చీకటిపై వెలుగు, అజ్ఞానంపై జ్ఞానం, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని వివరించారు. ద్వేషం, ప్రతికూల ఆలోచనలు తొలగిపోయి సమాజంలో సద్భావన పెరగాలని ఆకాంక్షించారు. అయోధ్యలో దీపోత్సవం సందర్భంగా సుమారు 30 లక్షల దీపాలు వెలిగిస్తున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్రతి ఇంటిలోనూ దీపాలు వెలిగించే సంప్రదాయం విస్తరించాలని అన్నారు. కొవ్వొత్తులకు బదులుగా మట్టి ప్రమిదలు వినియోగించాలని, తద్వారా కుమ్మరులు, స్థానిక చేతివృత్తుల కళాకారులకు ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేసి ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తిని చాటాలని కోరారు. నవంబర్ 8న జరుపుకోనున్న దీపావళిని ప్రజలంతా ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలని సూచించారు. బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు నిత్యజీవితంలోనూ సమయ పాలన, క్రమశిక్షణ పాటించాలని, విధులను అంకితభావంతో గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ మాట్లాడుతూ, ఉద్యోగులతో గవర్నర్ ఆత్మీయంగా మమేకమై దీపావళి వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో దాన కిషోర్ సతీమణి అపర్ణ, సంయుక్త కార్యదర్శి శశికిరణాచారి, ఏడీసీ కాంతిలాల్, అమన్ కుందూ, ఓఎస్డీ శేషగిరిరావు, డిప్యూటీ సెక్రటరీ పల్లవి, అసిస్టెంట్ సెక్రటరీ మురళీచార్యులు, ప్రెస్ సెక్రటరీ మామిండ్ల దశరథం తదితరులున్నారు.



www.prajanaava.in

Telugu Daily

ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

ఈ20 కాదు.. 420

- పెట్రోల్‌లో 30 శాతానికి పైగా ఇథనాల్
- 14 నమూనా పరీక్షల్లో వెల్లడి
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

2




Published from: **Karimnagar, Rangareddy, Hyderabad** Circulated to: **Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

కరీంనగర్ | సంపుటి 04 | సంచిక: 49 | ఆదివారం | 8 నవంబర్, 2026



ప్రమిద కాంతుల్లో అయోధ్య ధగధగ

దీపోత్సవ వేడుకల నందర్భంగా వేలాది మట్టి ప్రమిదలు, విద్యుద్దీపాల అలంకరణలతో వెలుగులీనుతున్న అయోధ్య నగరం. దీపాల కాంతులతో నగరమంతా పండుగ శోభను సంతరించుకుంది. హిందూ సంప్రదాయంలో అయోధ్యకు ప్రత్యేక స్థానం ఉంది. శ్రీరాముడి జన్మస్థలంగా ప్రసిద్ధి చెందిన ఈ నగరంలో దీపావళిని అత్యంత వైభవంగా జరుపుకుంటారు. శ్రీరాముడి అయోధ్యా పునరాగమనానికి గుర్తుగా ఇళ్లతో పాటు వీధులు, ఆలయాలు, ఘాట్లను దీపాలతో అలంకరిస్తారు. దీపోత్సవం ద్వారా రామాయణంలోని విలువలు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెబుతారు. – అయోధ్య



ఎమర్జెన్సీ తప్పే!

- నాటి నిర్ణయాన్ని ఇందిర కూడా తప్పుగానే భావించి ఉండొచ్చు
- సంజయ్‌ను అదుపులో పెట్టి ఉంటే నష్టం తగ్గేది
- ఎమర్జెన్సీపై కుటుంబంలోనూ భిన్నాభిప్రాయాలు
- కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ

2

ఆరుతడి పంటలే మేలు


నీటి లభ్యతను బట్టి పంటలు సాగు చేయాలి.. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తలెత్తే అవకాశం

- ప్రాజెక్టుల్లోని నీళ్లు తాగునీటికే సరిపోతాయి
- ఎండల తీవ్రత పెరిగే ప్రమాదం.. రైతులు జాగ్రత్తగా ఉండాలి
- ఎల్‌నినోపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు
- కాళేశ్వరం, ఎల్‌నినోపై చర్చకు సిద్ధం
- డిసెంబరులో స్పీకర్ ప్రత్యేక అసెంబ్లీని సమావేశ పరచాలి
- భూములు కోల్పోయే రైతులకు ఎకరాకు రూ.20 లక్షల వరకు పరిహారం
- సంక్రాంతి తర్వాత అన్ని జిల్లాల్లో పర్యటిస్తా
- కొడంగల్ అభివృద్ధికి భారీ ప్రణాళికలు
- కాళేశ్వరం, ఎల్‌నినోపై చర్చకు సిద్ధం
- కొడంగల్ వేదికగా బీఆర్ఎస్‌కు సీఎం రేవంత్ రెడ్డి సవాల్



2

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ప్రాజెక్టుల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీరు తాగునీటి అవసరాలకే సరిపోతుందని, రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరగవచ్చని తెలిపారు. రైతులు వరి వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. ఎల్‌నినోపై బీఆర్ఎస్ నేతల ప్రచారాన్ని నమ్మి నష్టపోవద్దని కోరారు. సంక్రాంతి తర్వాత అన్ని జిల్లాల్లో పర్యటిస్తానని ప్రకటించారు. మూడు రోజుల కొడంగల్ పర్యటనలో భాగంగా శనివారం హకీంపేట, దుద్యాల మండలాల్లో రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభించిన సీఎం.. పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు.



ఏదుల నుంచి డిండికి

నీళ్లు సాధ్యం కాదు

గోదావరి–కృష్ణా అనుసంధానమే శాశ్వత పరిష్కారం

- డిండి వద్ద సాంకేతిక వివరాలతో కవిత పవర్‌పాయింట్ ప్రజెంటేషన్
- ప్రభుత్వం వెంటనే పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయాలనిడిమాండ్

ప్రజానావ, నల్లగొండ: ఏదుల నుంచి డిండి రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు కే శ్రీశైలం నుంచి రెండు టీఎంసీల నీటిని తీసుకురావడం సాధ్యం కాని పరిస్థితుల్లో ఏదుల నుంచి డిండికి నీటిని ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. డిండి నీటి సమస్యకు గోదావరి, కృష్ణా నదుల అనుసంధానమే శాశ్వత పరిష్కారమని స్పష్టం చేశారు. శనివారం డిండి రిజర్వాయర్ వద్ద సాంకేతిక అంశాలను వివరిస్తూ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. శ్రీశైలం నుంచి నీటిని తీసుకునే స్థాయిని 800 అడుగుల నుంచి 820 అడుగులకు పెంచినప్పటికీ, ఎల్లూరు పంపుహౌస్‌ను ఓపెన్‌కట్ నుంచి భూగర్భంలోకి మార్చడం వల్ల సమస్యలు తలెత్తాయని కవిత పేర్కొన్నారు. అప్రోచ్ చానల్ వెడల్పు 140 మీటర్ల నుంచి 50 మీటర్లకు తగ్గిందని, ఎల్లూరు పంపుహౌస్ నిర్మాణంలో చేపట్టిన పేలుళ్ల కారణంగా కల్వకుర్తి పంపుహౌస్‌లో ఒక పంపు దెబ్బతిన్నదని ఆరోపించారు. దానిని ఇప్పటికీ పునరుద్ధరించలేదని, ఇప్పుడు మరో 0.6 టీఎంసీల నీటి కోసం కొత్త సోర్స్ పాయింట్ వద్ద పంపుహౌస్ నిర్మిస్తే కల్వకుర్తి, పాలమూరు పంపుహౌస్‌లకు ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. ఏదులను డిండికి నీటి మూలంగా ఎలా నిర్ణయించారని కవిత ప్రశ్నించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిది సార్లు సర్వేలు నిర్వహించినా సోర్స్ పాయింట్‌ను గుర్తించలేకపోయిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ప్రాతిపదికన ఈ నిర్ణయం తీసుకుందో వివరించాలని డిమాండ్ తరువాయి 2లో..



ఒకే కేబుల్..
ఎన్నో అవసరాలు!

- టార్చ్, లైటర్ సదుపాయంతో కొత్త ఛార్జింగ్ కేబుల్స్
- మోజెన్ నుంచి ఫ్లో ఇగ్నైట్, ఫ్లో నోమాడ్ విడుదల
- రూ.799 నుంచి ప్రారంభ ధరలు.. 100 వాట్ల వరకు ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయం



ప్రజానావ, టెక్నాలజీ:

స్మార్ట్‌ఫోన్ నుంచి ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల వరకు ప్రతి దానికీ ప్రత్యేకమైన ఛార్జింగ్ కేబుల్ అవసరమవుతోంది. దీంతో ప్రయాణాల సమయంలో రకరకాల కేబుల్లను వెంట తీసుకెళ్లడం చాలామందికి ఇబ్బందిగా మారుతోంది. ఈ సమస్యకు పరిష్కారంగా ఆమ్‌కెట్ సంస్థకు చెందిన మోజెన్ సరికొత్త ఛార్జింగ్ కేబుల్లను మార్కెట్లోకి తీసుకొచ్చింది. ఫ్లో ఇగ్నైట్, ఫ్లో నోమాడ్ పేర్లతో రెండు రకాల కేబుల్లను అందుబాటులోకి తెచ్చింది. ఛార్జింగ్‌తో పాటు అదనపు సదుపాయాలను కూడా వీటిలో పొందుపరిచింది.

టార్చ్, లైటర్‌తో ఫ్లో ఇగ్నైట్

ఫ్లో ఇగ్నైట్ కేబుల్ ధర రూ.799గా నిర్ణయించారు. సాధారణ ఛార్జింగ్ కేబుల్‌కు భిన్నంగా ఇందులో టార్చ్, ఎలక్ట్రిక్ లైటర్ సదుపాయాలను జోడించారు. యూఎస్‌బీ టైప్–సి నుంచి టైప్–సి కనెక్షన్‌తో పనిచేసే ఈ కేబుల్ 100 వాట్ల వరకు ఫాస్ట్ ఛార్జింగ్‌కు మద్దతు ఇస్తుంది. పీడీ, క్యూసీ, ఎస్ఎస్‌పి, ఏవీఎస్ వంటి ఛార్జింగ్ విధానాలకు అనుకూలంగా ఉంటుంది. ఇందులోని లైటర్‌తో కొవ్వొత్తులను వెలిగించుకోవచ్చు. విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు, క్యాంపింగ్ వంటి ప్రయాణాల్లో టార్చ్ ఉపయోగపడుతుంది. ఒకే కేబుల్‌లో ఛార్జింగ్‌తో పాటు వెలుతురు, లైటర్ సదుపాయాలు ఉండటం దీని ప్రత్యేకత.

మూడు రకాల కనెక్టర్లతో నోమాడ్

మరో మోడల్ ఫ్లో నోమాడ్ ధర రూ.1,099. ప్రయాణాల్లో కేబుల్‌ను సులభంగా వెంట తీసుకెళ్లేందుకు వీలుగా ల్యాన్యార్డ్ తరహా డిజైన్‌తో రూపొందించారు. ఇందులో యూఎస్‌బీ–ఏ, యూఎస్‌బీ టైప్–సి, లైట్నింగ్ కనెక్టర్లు ఉన్నాయి. దీంతో వివిధ రకాల ఛార్జింగ్ పోర్టులు కలిగిన పరికరాలకు ఒకే కేబుల్‌తో కనెక్ట్ చేసుకోవచ్చు. వేర్వేరు కేబుల్లను వెంట తీసుకెళ్లాల్సిన అవసరం తగ్గుతుంది.

480 ఎంబీపీఎస్ వేగంతో డేటా బదిలీ

ఈ రెండు కేబుల్లు గరిష్ఠంగా 480 ఎంబీపీఎస్ వేగంతో డేటా బదిలీకి మద్దతు ఇస్తాయి. ఆమ్‌కెట్ అధికారిక వెబ్‌సైట్‌తో పాటు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఆన్‌లైన్ విక్రయ వేదికల్లో వీటిని కొనుగోలు చేయవచ్చు. రోజువారీ వినియోగంతో పాటు ప్రయా ణాలు చేసేవారికి ఉపయోగపడేలా రూపొందించిన ఈ కొత్త కేబుల్ల ఛార్జింగ్ అవసరాలను మరింత సులభతరం చేయనున్నాయి.



మీ ఫోనే.. పవర్ బ్యాంక్!
ఇక నో ఛార్జింగ్ టెన్షన్

ఒక ఫోన్‌తో మరో ఫోన్‌కు ఛార్జింగ్ పెట్టుకునే వెసులుబాటు.. రివర్స్ ఛార్జింగ్‌తో కొత్త ప్రయోజనం

ప్రజానావ, టెక్నాలజీ:

ప్రయాణాల్లో ఉన్నప్పుడు ఫోన్‌లో ఛార్జింగ్ అయిపోతే చాలా ఇబ్బందిగా ఉంటుంది. ముఖ్యమైన కాల్స్ చేయాల్సిన సమయంలో, అత్యవసరంగా ఎవరినైనా సంప్రదించాల్సినప్పుడు ఫోన్ ఆగిపోతే సమస్య మరింత పెరుగుతుంది. ఇలాంటి సమయాల్లో మరో ఫోన్ సాయంతో మన ఫోన్‌కు ఛార్జింగ్ పెట్టుకోవచ్చు. ఇందుకోసం ప్రత్యేకంగా పవర్ బ్యాంక్ కొనాల్సిన అవసరం లేదు. కొన్ని స్మార్ట్‌ఫోన్లలో అందుబాటులో ఉన్న రివర్స్ వైర్డ్ ఛార్జింగ్ సదుపాయంతో ఒక ఫోన్ నుంచి మరో ఫోన్‌కు ఛార్జింగ్ పెట్టుకోవచ్చు.

కేబుల్ ఉంటే సరిపోతుంది

ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవడానికి రెండు వైపులా టైప్–సి కనెక్టర్లు ఉన్న కేబుల్ అవసరం. కొన్ని ఫోన్లకు ఓటీజీ అడాప్టర్ కూడా కావచ్చు. ముందుగా ఎక్కువ ఛార్జింగ్ ఉన్న ఫోన్‌కు కేబుల్ ఒక చివరను, ఛార్జింగ్ తక్కువగా ఉన్న ఫోన్‌కు మరో చివరను కలపాలి. ఆ తర్వాత ఫోన్ తెరపై కనిపించే యూఎస్‌బీ నోటిఫికేషన్‌ను తెరవాలి. అందులో మరో పరికరానికి ఛార్జింగ్ ఇవ్వండి అనే ఎంపిక ఉంటే దాన్ని ఎంచుకోవాలి. దీంతో ఎక్కువ ఛార్జింగ్ ఉన్న ఫోన్ నుంచి మరో ఫోన్‌కు విద్యుత్ అందుతుంది. ఛార్జింగ్ మొదలవుతుంది.

అత్యవసర సమయాల్లో ఉపయోగం

ఈ సదుపాయం ఉన్న ఫోన్ పవర్ బ్యాంక్‌లా పనిచేస్తుంది. ముఖ్యంగా ప్రయాణాల్లో ఉన్నప్పుడు, విద్యుత్ సరఫరా లేని సమయంలో ఇది ఉపయోగపడుతుంది. అయితే అన్ని ఫోన్లలో ఈ సదుపాయం ఉండదు. ఫోన్ రకాన్ని బట్టి ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది. కొన్ని ఫోన్లలో సెట్టింగ్స్‌లోకి వెళ్లి ఈ ఎంపికను ఎంచుకోవాల్సి ఉంటుంది. ఛార్జింగ్ వేగం కూడా ఫోన్‌ను బట్టి మారుతుంది. కాబట్టి ఈ విధానాన్ని ఉపయోగించే ముందు తమ ఫోన్‌లో ఈ సదుపాయం ఉందో లేదో తెలుసుకోవాలి.







మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు

మాస శివరాత్రి సందర్భంగా శనివారం వేములవాడ రాజన్న, భీమన్న ఆలయాల్లో ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేసినట్లు అర్చకులు గణేష్ శర్మ తెలిపారు. ఉదయం మహన్యాస పూర్వక ఏకాదశరథ అభిషేక పూజ కార్యక్రమాలతో పాటు సాయంత్రం మహాలింగార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వెల్లడించారు. ముందుగా జ్యోతులను లింగాకారంలో వెలిగించి విశేష పూజా కార్యక్రమాలు చేశారు. స్వామివారిని ప్రత్యేక పుష్పలతో శోభాయమానంగా అలంకరించారు.

– ప్రజానావ, వేములవాడ



నోబెల్ పొందిన తొలి ఏషియన్ సీవీ రామన్

ప్రజానావ, వేములవాడ: భారతదేశం గర్వించదగ్గ గొప్ప భౌతిక శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ 138వ, జయంతి సందర్భంగా ప్రాథమిక పాఠశాల న్యూ అర్బన్ కాలనీ వేములవాడలో రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కాంతి కిరణాలు పారదర్శక పదార్థం గుండా ప్రయాణించినప్పుడు దాని తరంగధైర్ఘ్యంలో వచ్చే మార్పును ఆయన కనిపెట్టారని, ఈ సంచలన ఆవిష్కరణనే రామన్ ఎఫెక్ట్ అంటారని, ఈ ప్రయోగానికి ఆయన కేవలం రూ.200 లోపు విలువైన సాధారణ పరికరాలనే వినియోగించడం విశేషమని, బ్రిటిష్ ప్రభుత్వం 1929 లో ఆయనకు సర్ బిరుదును ప్రదానం చేసిందని, కాంతి పరిక్షేపణం పై చేసిన పరిశోధనకు గాను 1930 లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించిందని, సైన్స్ విభాగంలో నోబెల్ పొందిన తొలి ఆసియా వ్యక్తి ఆయనేనని, స్వతంత్ర భారతదేశం అత్యున్నత పురస్కారమైన భారతరత్న తో 1954 లో ఆయనను సత్కరించిందని, ఇంకా లెనిన్ శాంతి బహుమతి వంటి పలు అంతర్జాతీయ గౌరవాలు దక్కాయని, ఆయన రామన్ ఎఫెక్ట్ ను ప్రకటించిన ఫిబ్రవరి 28 తేదీని భారతదేశంలో ప్రతి సంవత్సరం జాతీయ సైన్స్ దినోత్సవంగా ఘనంగా నిర్వహిస్తారని, సర్ సీవీ రామన్ నవంబర్ 21, 1970 న బెంగళూరులో తుదిశ్వాస విడిచారని, జీవితాంతం శాస్త్ర విజ్ఞాన అభివృద్ధికి రామన్ తనను తాను అంకితం చేసుకున్నాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్గేటి లక్ష్మీ నారాయణ,కంకెల్కార్ మోహన్,అంగన్వాడి ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల,పులి శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో చికిత్స పొందుతున్న యువకుడికి చేయూత

- రాకేకు బండి సంజయ్ ఆర్థిక సాయం



ప్రజానావ, వేములవాడ: చందుర్తి మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన మరిపెల్లి రాకేష్ (34) తీవ్రమైన పచ్చకామెర్ల వ్యాధితో సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, ఎంపీ బండి సంజయ్ కుమార్ స్పందించి వైద్య ఖర్చుల కోసం రూ.50 వేల ఆర్థిక సహాయం అందించారు. ఆయన పంపిన నగదును బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి శనివారం బాధిత కుటుంబానికి అందజేశారు. అనంతరం వైద్యులతో మాట్లాడి రాకేష్‌కు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మార్త సత్తయ్య, చందుర్తి మండల అధ్యక్షుడు మోకిలి విజయేందర్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రూ.35కోట్లతో రామగుండం అభివృద్ధి

- ప్రతి గల్లీలో రోడ్లు, సెంట్రల్ లైటింగ్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ
- మసీదు టర్నింగ్ వద్ద సెంట్రల్ లైటింగ్ ప్రారంభించిన ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్

ప్రజానావ, పెద్దపల్లి: రామగుండం పట్టణాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రూ.35 కోట్లతో మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాగూర్ తెలిపారు. దీపావళి సందర్భంగా పట్టణంలోని మసీదు టర్నింగ్ వద్ద ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బి పవర్‌హౌస్ గడ్డ (హనుమాన్ జంక్షన్) నుంచి లింగాపూర్ మీదుగా స్టేషన్ ఫ్లైఓవర్ వరకు రోడ్లు, సెంట్రల్ లైటింగ్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. 30వ డివిజన్‌లోని ఇంద్రనగర్, మహబూబ్ సుభాని నగర్, ఖాదర్ కాలనీలతో పాటు 25 నుంచి 29వ డివిజన్లలో ప్రతి గల్లీకి రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామని, నియోజకవర్గంలో సుమారు వెయ్యి ఇళ్ల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. హౌసింగ్ బోర్డు ప్రాంతంలో రూ.2 కోట్లతో వాటర్ ట్యాంక్, మైనారిటీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు.

రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్, జడ్పీహెచ్ఎస్ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు అయోధ్య సింగ్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దీటి బాలరాజు, కార్పొరేషన్ అధ్యక్షుడు, కార్పొరేటర్ ముస్తఫా, పలువురు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



8న 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి'

- ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలి
- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్
- అధికారులతో అదనపు కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్

ప్రజానావ, సిరిసిల్ల: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఈ నెల 8వ తేదీన జిల్లాలో మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 8వ తేదీన మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమం నిర్వహణపై జిల్లాలోని ఎంపీడీవో లు, హౌసింగ్ శాఖ, జిల్లా పంచాయతీ శాఖ అధికారులతో శుక్రవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ జిల్లాలో పూర్తయిన ఇళ్ల ముందు గోడలపై మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి అనే లోగో స్టిక్కర్‌ను అతికించాలని, లబ్ధిదారుల వివరాలను రాయాలని సూచించారు. ఇందిరమ్మ ఇంటి ఎదుట లబ్ధిదారుల కుటుంబ సభ్యులందరితో కలిసి దీపం వెలిగించి, ఇందిరమ్మ ఇళ్లు (మొబైల్ యాప్ ద్వారా ఫోటో తీసి, లబ్ధిదారులు లేదా వారి కుటుంబ సభ్యుల సోషల్ మీడియా ఖాతాల్లో అప్ లోడ్ చేయాలని తెలిపారు. జిల్లాలోని ఆయా గ్రామాల. పంచాయతీ కార్యదర్శి, మున్సిపాలిటీల్లో వార్డు అధికారి ద్వారా, పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల వద్ద లబ్ధిదారుల ఫోటోలను తీసి, సోషల్ మీడియా ఖాతాల్లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల్లో ఇల్లు నిర్మించకముందు.. నిర్మించిన తర్వాత ఉన్న స్థితిని చూపేలా ఒక ఫ్లెక్సీని తయారు చేసి, అందరికీ కనిపించేలా ప్రముఖ ప్రదేశంలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తమ పరిధిలో పూర్తిగా పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను గుర్తించాలని, లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజా ప్రతినిధులు, గృహ నిర్మాణ శాఖ, ఆయా శాఖల అధికారులు ఇందిరమ్మ గృహ కమిటీలతో సమన్వయం చేసుకుని, పూర్తయిన ఇళ్లను సందర్శించి, లబ్ధిదారులతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొనాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సూచించారు. టెలీ కాన్ఫరెన్స్ లో జడ్పీ సీఈవో లక్ష్మీ నారాయణ ఇన్‌చార్జి హౌసింగ్ పీడీ సాజిద్ తదితరులు ఉన్నారు.





పాత నేరస్థులపై ప్రత్యేక నిఘా

- రాత్రి వేళల్లో పోలీసుల ఆకస్మిక తనిఖీలు.. ప్రస్తుత కార్యకలాపాలపై ఆరా
- జిల్లాలో నేరాల నియంత్రణే లక్ష్యంగా నిరంతర ఆకస్మిక తనిఖీలు
- తరచూ నేరాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు • జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

ప్రజానావ, సిరిసిల్ల : జిల్లాలో గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, ఎవరైనా తిరిగి నేరాలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే హెచ్చరించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే లక్ష్యంగా వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న పాత నేరస్థులపై జిల్లా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రాత్రి వేళల్లో పాత నేరస్థుల వద్దకు వెళ్లి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా పాత నేరస్థులు ప్రస్తుతం ఎక్కడ నివసిస్తున్నారు, ఏం చేస్తున్నారు, వారి ప్రస్తుత కార్యకలాపాలు ఏమిటి, ఎవరితో సంబంధాలు కలిగి ఉన్నారు అనే విషయాలపై పోలీసులు ఆరా తీసి,తిరిగి నేరాలకు పాల్పడకుండా ముందస్తు చర్యలలో భాగంగా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో నేరాల నియంత్రణకు నిరంతర పెట్రోలింగ్, ఆకస్మిక తనిఖీలు చేపడుతూ ప్రజలకు ప్రశాంతమైన వాతావరణం కల్పించేందుకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.


నవంబర్ 15న చలో నల్గొండ రైతు సభలకు తరలిరండి

- జిల్లాలో కరువు నివారణ చర్యలు చేపట్టాలి
- ఐకేపీ కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి
- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి. స్కైలాబ్ బాబు



ప్రజానావ, సిరిసిల్ల: నవంబర్ 15న నల్గొండలో నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభల సందర్భంగా చలో నల్గొండ రైతు సభలకు సిరిసిల్ల జిల్లా రైతులు పెద్దఎత్తున తరలిరావాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి. స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. శనివారం సిరిసిల్లలోని అమృత్ లాల్ శుక్ల భవన్‌లో అక్టోబర్ రష్యన్ విప్లవ ప్రభావంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలో కరువు మండలాలుగా ప్రకటించిన ఇల్లంతకుంట, వీర్నపల్లిలో తక్షణమే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని, ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేస్తూ కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. డిసెంబర్ 1, 2 తేదీల్లో జరిగే చలో ఢిల్లీ కార్మికుల ఆందోళనకు సీపీఎం మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మూషం రమేష్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజల్లో సర్పంచ్ దంపతులు



ప్రజానావ, వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం చంద్రగిరి గ్రామంలోని అగ్రహారంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న ఏడు శనివారాల వ్రతంలో భాగంగా చివరి శనివారం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో సర్పంచ్ ముత్త సంజన మహేష్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ ముత్త సంజన మహేష్ లను సాదరంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. స్వామివారి దివ్య ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, చంద్రగిరి గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.

ఇందిరమ్మ ఇల్లు పేదల ఆత్మగౌరవానికి ప్రతీక

ప్రజానావ, హైదరాబాద్: ఇందిరమ్మ ఇల్లు.. ప్రతి పేద కుటుంబానికి ఆత్మ గౌరవం, భద్రత, భరోసా కల్పించే చిరునామా అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమం'పై మంత్రి శనివారం సచివాలయంలో హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. 'ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నాం. మొదటి విడతలో నియోజకవర్గానికి 3,500 చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశాం' అని మంత్రి పేర్కొన్నారు.

అర్హులైన బాలికలందరికీ హెచ్‌పీవీ టీకా వేయాలి

- వ్యాక్సినేషన్ లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలి
- డీఎంహెచ్ఓ డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్

ప్రజానావ, సిరిసిల్ల: జిల్లాలో అర్హులైన బాలికలందరికీ హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (యూపీహెచ్‌సీ) ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫార్మసీ స్టోర్‌లో మందుల నిల్వలు, పంపిణీ విధానం, రికార్డులు, రిజిస్టర్ల నిర్వహణను పరిశీలించారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్యసేవల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ లక్ష్యాలను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఔటర్‌రీచ్ ఇమ్యునైజేషన్ కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ, అర్హులైన చిన్నారులందరికీ టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌సీడీ కార్యక్రమం రికార్డులను పరిశీలించి, రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ వంటి అసంక్రమిత వ్యాధులను ముందుగానే గుర్తించడం, పరీక్షలు, చికిత్స, తదుపరి పర్యవేక్షణను సమర్థంగా నిర్వహించాలని ఆదేశించారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా ప్రజలకు వ్యాధిపై అవగాహన కల్పించాలని డీఎంహెచ్ఓ సూచించారు. పొగాకు ఉత్పత్తుల వినియోగం, ధూమపానం, మద్యపానం వల్ల క్యాన్సర్‌తోపాటు ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వివరించాలన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం, రోజువారీ వ్యాయామం, క్రమబద్ధమైన జీవనశైలితో క్యాన్సర్ ముప్పును తగ్గించుకోవచ్చని ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థంగా నిర్వహిస్తూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు.



విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

- డ్రగ్స్‌తో వ్యక్తి, కుటుంబం, సమాజానికి నష్టం
- చిన్న వయసు నుంచే ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి
- అవగాహన సదస్సులో డాక్టర్ ఎన్. దిలీప్ రావు

ప్రజానావ, జమ్మికుంట: విద్యార్థులు చిన్న వయసు నుంచే డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని నేషనల్ స్పోర్ట్స్ పర్సన్ డాక్టర్ ఎన్. దిలీప్ రావు సూచించారు. యునైటెడ్ నేషనల్ ఓటర్ సోషల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జమ్మికుంటలోని న్యూ మిలీనియం ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శనివారం ట్రూత్ అబౌట్ డ్రగ్స్ పేరుతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువు, క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎం. హేమలత, ఎస్ఐ ఎన్. రవి, పాఠశాల కరస్పాండెంట్ ముసిపట్ల తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ విశ్వనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





అద్భుతం.. అయోధ్య దీపోత్సవం

- ఇంతటి ఘనమైన వేడుకను ఎప్పుడూ చూడలేదు
- ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రశంసలు
- సరయూ తీరంలో 30 లక్షలకు పైగా దీపాల వెలుగులు
- అయోధ్య ప్రాంతమంతా 70 లక్షలకు పైగా ప్రమిదల కాంతులు

అయోధ్య: సరయూ నదీ తీరం దీపకాంతులతో వెలిగిపోయింది. ఎటుచూసినా ప్రమిదల వెలుగులు.. ఆకాశంలో డ్రోన్ల ప్రదర్శనలు.. రామాయణ ఘట్టాలను ఆవిష్కరించిన సాంస్కృతిక కార్యక్రమాలు.. ఇలా పదో అయోధ్య దీపోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. శనివారం జరిగిన ఈ వేడుకల్లో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రామాలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, సరయూ తీరంలో జరిగిన దీపోత్సవాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా వేడుకల నిర్వహణను ప్రశంసిస్తూ.. తన నాలుగు దశాబ్దాల ప్రజా జీవితంలో ప్రభుత్వ సంస్థ ఆధ్వర్యంలో ఇంతటి అద్భుతమైన, క్రమబద్ధమైన కార్యక్రమాన్ని చూడలేదని అన్నారు.

రాముడికి పట్టాభిషేకం.. ప్రత్యేక పూజలు

దీపోత్సవం ప్రారంభానికి ముందు రామకథా పార్కులో నిర్వహించిన శ్రీరామ పట్టాభిషేక కార్యక్రమంలో రాధాకృష్ణన్ పాల్గొన్నారు. ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సమక్షంలో రాముడికి పట్టాభిషేక తిలకం దిద్దారు. సీతాదేవి, లక్ష్మణుడు, భరతుడు, గురు వశిష్ఠుడికి సంబంధించిన ఆచారాలను కూడా నిర్వహించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు, హారతి ఇచ్చారు. 14 ఏళ్ల అరణ్యవాసం అనంతరం శ్రీరాముడు అయోధ్యకు తిరిగి వచ్చి పట్టాభిషిక్తుడైన సందర్భాన్ని గుర్తుచేసేలా ఈ వేడుకలు నిర్వహించారు.

సరయూ తీరంలో దీపాల వెలుగులు

అనంతరం ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి సరయూ నది తీరంలో ఉపరాష్ట్రపతి హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. రామ్‌కీ పైడీ వద్ద నిర్వహించిన దీపోత్సవంలో 30 లక్షలకు పైగా మట్టి ప్రమిదలను వెలిగించారు. అయోధ్య విస్తృత ప్రాంతంలో మొత్తంగా 70 లక్షలకు పైగా దీపాలను వెలిగించి వేడుకను ఘనంగా నిర్వహించారు.

యూపీ పర్యాటక శాఖకు అభినందనలు

దీపోత్సవం నిర్వహణపై ఉపరాష్ట్రపతి ప్రశంసలు కురిపించారు. ''నాలుగు దశాబ్దాలకు పైగా ప్రజా జీవితంలో ఉన్నాను. ప్రభుత్వ సంస్థ ఆధ్వర్యంలో యూపీ పర్యాటక శాఖ నిర్వహించినంత అద్భుతమైన, క్రమబద్ధమైన కార్యక్రమాన్ని ఎప్పుడూ చూడలేదు. ఇంత గొప్ప వేడుకను నిర్వహించిన పర్యాటక శాఖను అందరూ చప్పట్లతో అభినందించాలి'' అని ఆయన పిలుపునిచ్చారు. 2017 లో ప్రారంభమైన దీపోత్సవం ఏటేటా విస్తరిస్తోందని రాధాకృష్ణన్ పేర్కొన్నారు. తొలి ఏడాది 1.7 లక్షలకు పైగా దీపాలు వెలిగించగా.. 2025లో ఈ సంఖ్య 26 లక్షలు దాటి గిన్నిస్ ప్రపంచ రికార్డు సృష్టించిందని గుర్తుచేశారు. ఈ ఏడాది రామ్‌కీ పైడీ వద్ద 30 లక్షలకు పైగా, అయోధ్య ప్రాంతమంతా 70 లక్షలకు పైగా దీపాలు వెలిగించడం విశేషమన్నారు. 2,100కు పైగా స్వదేశీ డ్రోన్లతో నిర్వహించిన ప్రదర్శనలో ఆకాశంపై రామాయణ ఘట్టాలను ఆవిష్కరించడాన్ని ప్రశంసించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో స్థానిక కళాకారులతో సహా సుమారు వెయ్యి మంది పాల్గొన్నారని తెలిపారు. కాగా, అయోధ్య విమానాశ్రయానికి చేరుకున్న ఉప రాష్ట్రపతికి గవర్నర్ తదితర ప్రముఖులు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వేడుకల్లో పాల్గొన్నారు.

నాపైకి బుల్డోజర్లు నడపండి

- బీజేపీకి మమతా బెనర్జీ సవాల్
- అభిషేక్ ఇంటిపై దాడిని ఖండించిన మాజీ సీఎం
- కాళీ పూజలకు అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపణ



కోల్‌కతా: తన మేనల్లుడు, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ బెనర్జీ నివాసంపై బీజేపీ కార్యకర్తలు దాడి చేయడాన్ని పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా ఖండించారు. తమకు ఎదురు తిరిగే వారిపై బుల్డోజర్లను ప్రయోగించడం బీజేపీకి అలవాటుగా మారిందని విమర్శించారు. తనపై ఎన్ని బుల్డోజర్లనైనా నడపాలని ఆ పార్టీకి సవాల్ విసిరారు. 'మీ దగ్గర ఎన్ని బుల్డోజర్లు ఉన్నాయి? అన్నింటినీ తీసుకురండి. నేను మీ ముందే నిల్చొని ఉన్నాను. నాపై బుల్డోజర్లు నడపండి. మీ ధైర్యం ఏమిటో చూడాలనుకుంటున్నాను' అని వ్యాఖ్యానించారు. అభిషేక్ నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించిన అనంతరం మమత ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ నేతలు, కార్యకర్తలు తృణమూల్ నాయకులపై దాడులకు పాల్పడటమే కాకుండా, కాళీఘాట్ ప్రాంతంలో ఏళ్లుగా కొనసాగుతున్న కాళీ పూజలకు కూడా ఆటంకాలు కలిగిస్తున్నారని మమత ఆరోపించారు. పలు ప్రాంతాల్లో పూజల నిర్వహణకు ఇచ్చిన అనుమతులను రద్దు చేశారని, మరికొన్ని చోట్ల ప్రధాన రహదారులపై పూజలు చేసుకునేందుకు అనుమతించారని పేర్కొన్నారు. ఈ మార్పులకు కారణమేంటని ప్రశ్నించారు. కాగా, శనివారం తెల్లవారుజామున కాళీఘాట్‌లోని తన నివాసంపై బీజేపీ కార్యకర్తలు రాళ్లు, ఇటుకలతో దాడి చేశారని అభిషేక్ బెనర్జీ ఆరోపించారు. ఈ ఘటన నేపథ్యంలోనే మమత ఆయనను పరామర్శించి, బీజేపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

క్షిపణుల పరిధిపై ఆంక్షలు ఎత్తివేత

- 2వేల కి.మీ. పరిమితికి ఇరాన్ స్వస్తి
- మరింత దూరంలోని లక్ష్యాలపై గురి
- సుప్రీం లీడర్ పిలుపునిచ్చిన వారం రోజుల్లోనే ఐఆర్‌జీసీ ప్రకటన
- అంతరిక్ష సాంకేతికతతో ఖండాంతర క్షిపణుల అభివృద్ధికి అవకాశం

టెహ్రాన్: బాలిస్టిక్ క్షిపణుల పరిధిపై విధించుకున్న 2,000 కిలోమీటర్ల స్వీయ పరిమితిని తొలగించినట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) ప్రకటించింది. దీంతో మరింత దూరంలోని లక్ష్యాలను ఛేదించగల క్షిపణుల అభివృద్ధిపై ఇరాన్ దృష్టి సారించే అవకాశముందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇజ్రాయెల్, అమెరికా దాడులకు హద్దుల్లేని ప్రతిదాడులు చేయాలని సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ఇరాన్ సేనలకు పిలుపునిచ్చిన వారం రోజులకే ఈ ప్రకటన వెలువడటం ప్రాధాన్యం సంతరించుకుంది. క్షిపణుల పరిధికి సంబంధించిన పరిమితులు తొలగిపోయాయని, తమ సామర్థ్యాలను ఆచరణలోనూ ప్రదర్శిస్తామని ఐఆర్‌జీసీ జనరల్ హొస్సేన్ మొహెబ్బి మీడియా సమావేశంలో వెల్లడించారు. ప్రస్తుతం ఇరాన్ వద్ద 2,000 కిలోమీటర్లకు మించి ప్రయాణించగల బాలిస్టిక్ క్షిపణులు ఉన్నట్లు అధికారిక సమాచారం లేదు. అయినప్పటికీ, ఈ పరిధిలోనే అరేబియా ద్వీపకల్పం మొత్తం, ఈజిప్టులోని అత్యధిక ప్రాంతం, గ్రీస్, బాల్కన్ ప్రాంతాల్లోని కొన్ని భూభాగాలు చేరుతాయి. మరోవైపు, ఇరాన్ తన అంతరిక్ష కార్యక్రమానికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఖండాంతర బాలిస్టిక్ క్షిపణుల తయారీకి వినియోగించే అవకాశముందని అమెరికా ఆందోళన వ్యక్తం చేస్తోంది.



యెమెన్‌లో వైమానిక దాడులు.. 22 మంది మృతి

యెమెన్ రాజధాని సనా సమీపంలోని అల్–షరియా ప్రాంతంలో జరిగిన వైమానిక దాడిలో 22 మంది మరణించగా, మరో 30 మంది గాయప డ్డారని హూతీ తిరుగుబాటుదారుల ఆధ్వర్యంలోని ఆరోగ్యశాఖ ప్రకటిం చింది. మృతులు, క్షతగాత్రుల్లో ఎక్కువ మంది మహిళలు, చిన్నారులే ఉన్నారని తెలిపింది. ఈ దాడులకు సౌదీ అరేబియానే కారణమని హూతీలు ఆరోపించారు. దక్షిణ యెమెన్‌లోని ఓ మార్కెట్‌పై జరిగిన దాడుల్లో 30 మంది మరణించినట్లు హూతీలు ప్రకటించిన మరుసటి రోజే ఈ ఘటన చోటుచేసుకుంది.



గాల్లోనే చిక్కుకున్న పారాచూట్లు

- ల్యాండింగ్‌కు సిద్ధమవుతుండగా ఢీ
- ఇద్దరు స్కైడైవర్ల మృతి.. కాలిఫోర్నియాలో ఘటన

కాలిఫోర్నియా: స్కైడైవింగ్ కార్యక్రమంలో జరిగిన ప్రమాదం ఇద్దరి ప్రాణాలను బలిగొంది. గాల్లో ప్రయాణిస్తున్న సమయంలో రెండు పారాచూట్లు ఒకదానికొకటి ఢీకొని చిక్కుకుపోవడంతో ఇద్దరు స్కైడైవర్లు కిందపడి మృతిచెందారు. అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం లేక్ ఎల్సినోర్‌లో ఉన్న 'స్కైడైవ్ ఎల్సినోర్' సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతులిద్దరూ సుదీర్ఘ అనుభవం, చెల్లుబాటయ్యే లైసెన్సు కలిగిన స్కైడైవర్లేనని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. కార్యక్రమంలో భాగంగా గాల్లోకి దూసుకెళ్లిన ఇద్దరూ సుమారు 150 అడుగుల ఎత్తులో ల్యాండింగ్‌కు సిద్ధమవుతుండగా వారి పారాచూట్లు పరస్పరం ఢీకొన్నాయి. దీంతో అవి చిక్కుకుపోయి, ఇద్దరూ అదుపుతప్పి నేలపై పడిపోయారు. తీవ్రంగా గాయపడిన వారిని స్థానిక ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అయితే ఫ్రీఫాల్, పారాచూట్లు తెరుచుకునే ప్రక్రియ సాధారణంగానే జరిగిందని, పరికరాల్లో ఎలాంటి లోపాలు గుర్తించలేదని స్కైడైవ్ ఎల్సినోర్ సంస్థ తెలిపింది.



రాహుల్ అజేయ పోరాటం

• రెండో వన్డేలో భారత్ ఘన విజయం • కివీస్‌ను కట్టడి చేసిన యువ పేసర్లు • ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2–0తో ఆధిక్యంలో భారత్



వెల్లింగ్టన్: యువ పేసర్ల అద్భుత ప్రదర్శనతో న్యూజిలాండ్ బ్యాటింగ్ వెన్నువిరిస్తే.. లక్ష్య ఛేదనలో వికెట్లు పరుసగా పడుతున్నా కేఎల్ రాహుల్ సంయమనంతో పోరాడాడు. వర్షం అంతరాయం కలిగించిన రెండో వన్డేలో భారత్‌కు నాలుగు పరుగుల తేడాతో చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. తొలుత భారత బౌలర్లు కివీస్‌ను 41 ఓవర్లలో 134 పరుగులకే కట్టడి చేయగా.. 135 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 26 ఓవర్లలో ఏడు వికెట్లకు 113 పరుగులు చేసింది. ఆ సమయంలో వర్షం రావడంతో మ్యాచ్ నిలిచిపోయింది. డక్‌వర్త్ లూయిస్ (డీఎల్‌ఎస్) ప్రకారం భారత్ అప్పటికే నాలుగు పరుగుల ఆధిక్యంలో ఉండటంతో విజేతగా నిలిచింది. ఈ విజయంతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 2–0తో ఆధిక్యం సాధించింది. మూడో వన్డే మంగళవారం హామిల్టన్‌లో జరగనుంది. అంతకుముందు టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మేఘావృత వాతావరణం, పిచ్‌పై తేమను దృష్టిలో పెట్టుకుని న్యూజిలాండ్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. భారత యువ పేసర్లు ఆ నిర్ణయాన్ని సరైనదిగా నిరూపించారు. ఆకిబ్ నబీ (2/31) తొలి దెబ్బ కొట్టగా.. అన్షుల్ కాంబోజ్ (2/25) కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టాడు. టిమ్ సీఫెర్ట్ (0), విల్ యంగ్ (6), హెన్రీ నికోల్స్ (11) స్వల్ప స్కోర్లకే వెనుదిరగడంతో న్యూజిలాండ్ పవర్‌ప్లే ముగిసేసరికి 29 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత గుర్నూర్ బ్రార్ (4/30) తన వేగం, బౌన్స్‌తో కివీస్ బ్యాటర్లను బెంబేలెత్తించాడు. వరుస బౌన్సర్లతో టామ్ లాథమ్, గ్లెన్ ఫిలిప్స్‌ను పెవిలియన్‌కు పంపాడు. దీంతో న్యూజిలాండ్ 53 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. కెప్టెన్ గిల్ వదిలేసిన క్యాచ్ అవకాశంతో బతికిపోయిన డారిల్ మిచెల్ (55) కొంతసేపు పోరాడాడు. అతడికి మిచెల్ శాంట్నర్ (31) అండగా నిలిచాడు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 59 పరుగులు జోడించినా జట్టును ఆదుకోలేకపోయారు. చివరకు కివీస్ 41 ఓవర్లలో 134 పరుగులకు ఆలౌటైంది. అర్ష్‌దీప్ సింగ్ ఏడు ఓవర్లలో 16 పరుగులే ఇచ్చి కట్టుదిట్టంగా బౌలింగ్ చేశాడు. భారత బౌలర్లు మొత్తంగా 176 డాట్ బాల్స్ సంధించడం విశేషం.

టాపార్డర్ తడబ్యాటు.. రాహుల్ నిలకడ

స్వల్ప లక్ష్యమే అయినా పిచ్‌పై బౌన్స్, స్వింగ్ కారణంగా భారత బ్యాటర్లకు పరుగులు చేయడం అంత సులభం కాలేదు. తొలి బంతికే గిల్ (0) స్లిప్స్‌లో క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత విరాట్ కోహ్లీ (7)ను జాకబ్ డఫీ పెవిలియన్ చేర్చాడు. రోహిత్ శర్మ (23) ఒక భారీ సిక్సర్ కొట్టినా.. కదులుతున్న బంతులను ఎదుర్కోవడంలో ఇబ్బంది పడ్డాడు. స్లిప్స్‌లో క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. అక్షర్ పటేల్ (7) కూడా ఎక్కువసేపు నిలవలేదు. శ్రేయస్ అయ్యర్ (30) కాసేపు పోరాడినా.. మరోసారి షార్ట్ బాల్‌కు బలయ్యాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా రాహుల్ మాత్రం క్రీజులో నిలకడగా ఆడాడు. తొలి 20 బంతుల్లో 18 డాట్ బాల్స్ ఆడిన అతడు.. ఆ తర్వాత క్రమంగా వేగం పెంచాడు.

రెండు ఫుల్ షాట్లతో ఆకట్టుకున్నాడు. అందులో ఒకదాన్ని సిక్సర్‌గా మలిచాడు. స్కోరుబోర్డుపై ఒత్తిడి లేకపోవడంతో ఆచితూచి ఆడుతూ జట్టును విజయానికి చేరువ చేశాడు. డఫీ బౌలింగ్‌లో మరో సిక్సర్ బాది భారత్‌ను వంద పరుగుల మైలురాయి దాటించాడు. ఈ క్రమంలో నామన్ ధీర్ (12), అన్షుల్ కాంబోజ్ వికెట్లు కోల్పోయినా.. రాహుల్ అజేయంగా 26 పరుగులతో క్రీజులో నిలిచాడు. ఇంతలో వర్షం రావడంతో ఆట నిలిచిపోయింది. డీఎల్‌ఎస్ ప్రకారం భారత్ లక్ష్యాన్ని మించి ఉండటంతో విజయం ఖాయమైంది.

వైఫల్యాల నుంచి వికెట్ల వేటలో!

• కివీస్ గడ్డపై అదరగొడుతున్న గుర్నూర్ బ్రార్



వెల్లింగ్టన్: వెస్టిండీస్ సిరీస్‌లో బౌలింగ్‌లో తడబడిన భారత యువ పేసర్ గుర్నూర్ బ్రార్.. న్యూజిలాండ్ పర్యటనలో అదరగొడుతున్నాడు. గత వైఫల్యాలను అధిగమించి సత్తా చాటుతున్నాడు. కివీస్‌తో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌ల్లోనే ఏడు వికెట్లు పడగొట్టి అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. శనివారం వర్షం అంతరాయం కలిగించిన రెండో వన్డేలో 30 పరుగులిచ్చి నాలుగు వికెట్లు తీసి, డక్ వర్త్ లూయిస్ పద్ధతిలో భారత్‌కు నాలుగు పరుగుల విజయాన్ని అందించడంలో కీలకపాత్ర పోషించాడు. ఈ ప్రదర్శనతో 2027 వన్డే ప్రపంచకప్ జట్టులో చోటు కోసం తన వాదనను బలంగా వినిపిస్తున్నాడు. 26 ఏళ్ల బ్రార్ గతంలో లార్డ్స్, గువాహటిలో భారీగా పరుగులు సమర్పించుకోవడం నిరాశ కలిగించిందని చెప్పాడు. అయితే వైఫల్యాల గురించి ఆలోచించకుండా బౌలింగ్‌ను మెరుగుపరుచుకోవడంపైనే దృష్టి పెట్టానని వివరించాడు. అఫ్గానిస్తాన్‌తో ఏడు, ఇంగ్లండ్‌తో నాలుగు వికెట్లు తీసి అంతర్జాతీయ కెరీర్‌ను ఘనంగా ప్రారంభించిన అతడు.. వెస్టిండీస్‌తో మూడు మ్యాచ్‌ల్లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. అయినా జట్టు యాజమాన్యం తనపై నమ్మకం ఉంచిందని, ఇప్పుడు ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపాడు. కష్టకాలంలో కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఇచ్చిన మద్దతు ఎంతో ఉపయోగపడిందని బ్రార్ పేర్కొన్నాడు.

చరిత్ర సృష్టించిన అద్కర్-భోసలే

• డబుల్స్ ఫైనల్లోకి భారత జోడీ • డబ్ల్యూటీఏ టూర్ స్థాయి ఫైనల్‌కు చేరిన తొలి భారత జోడీగా రికార్డు
• సెమీఫైనల్లో రెండో సీడ్ జోడీపై గెలుపు • టైటిల్ పోరులో స్విస్ జోడీతో అమీతుమీ



చెన్నై: భారత మహిళల టెన్నిస్‌లో వైష్ణవి అద్కర్, రుతుజా భోసలే చరిత్ర సృష్టించారు. డబ్ల్యూటీఏ టూర్ స్థాయి మహిళల డబుల్స్ ఫైనల్‌కు చేరిన తొలి పూర్తిస్థాయి భారత జోడీగా రికార్డు నెలకొల్పారు. శనివారం జరిగిన చెన్నై ఓపెన్ సెమీఫైనల్లో భారత జంట 6–2, 2–6, 10–8తో రెండో సీడ్ పోలాండ్‌కు చెందిన వెరోనికా ఫాల్కోవ్స్కా, అమెరికా క్రీడాకారిణి అలానా స్మిత్ జోడీని ఓడించింది. మధ్యలో ప్రత్యర్థులు పుంజుకున్నా.. నిర్ణయాత్మక సూపర్ టైబ్రేక్‌లో అద్భుతంగా పోరాడి విజయాన్ని అందుకుంది. తొలి సెట్‌లో అద్కర్, భోసలే పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. ప్రత్యర్థుల తప్పిదాలను సద్వినియోగం చేసుకుంటూ 4–1తో ఆధిక్యంలోకి వెళ్లారు. మూడో గేమ్‌లో అద్కర్ ధాటైన రిటర్న్‌తో తొలి బ్రేక్ సాధించగా.. ఆ తర్వాత భోసలే తన సర్వీస్‌ను నిలబెట్టుకుంది. ఫాల్కోవ్స్కా ఫోర్‌హ్యాండ్ పొరపాటును ఉపయోగించుకుని మరో బ్రేక్ సాధించిన భారత జోడీ.. తొలి సెట్‌ను 6–2తో సొంతం చేసుకుంది. రెండో సెట్‌లో మాత్రం పరిస్థితి మారింది. మూడో, ఐదో గేమ్‌లలో బ్రేక్ అవకాశాలను భారత జంట చేజార్చుకుంది. ఆరో గేమ్‌లో అద్కర్ వరుసగా రెండు డబుల్ ఫాల్ట్‌లు చేయడంతో సర్వీస్ కోల్పోయింది. అనంతరం భోసలేపైనా ఒత్తిడి పెంచిన ప్రత్యర్థులు సెట్‌ను 6–2తో గెలిచి మ్యాచ్‌ను సమం చేశారు. ఈ క్రమంలో ఎడమ తొడకు గాయంతో బాధపడుతున్న అద్కర్ వైద్య సాయం కూడా తీసుకుంది. నిర్ణయాత్మక సూపర్ టైబ్రేక్‌లో ఫాల్కోవ్స్కా–స్మిత్ జోడీ 3–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. భారత జంట పుంజుకుని పోటీలో నిలిచినా.. ఒక దశలో 6–8తో వెనుకబడింది. ఆ సమయంలో భోసలే అద్భుతమైన ఫోర్‌హ్యాండ్ విన్నర్‌తో పాయింట్ సాధించగా.. అద్కర్ కీలకమైన విన్నింగ్ వాలీతో మ్యాచ్ పాయింట్ అందించింది. అనంతరం అద్కర్ కొట్టిన అద్భుతమైన ఫోర్‌హ్యాండ్ డౌన్ ద లైన్ ప్రత్యర్థులకు అందకుండా వెళ్లడంతో భారత జంట 10–8తో గెలిచి చరిత్రాత్మక విజయాన్ని ఖాయం చేసుకుంది.

ఫైనల్లో స్విస్ జోడీతో పోరు

తుది పోరులో భారత జంట స్విట్జర్లాండ్‌కు చెందిన నైమా కరామోకో, సిమోనా వాల్టర్ జోడీతో తలపడనుంది. సెమీఫైనల్లో ఈ జంట 6–4, 6–4తో నెదర్లాండ్స్‌కు చెందిన ఇసబెల్లె హావర్‌లాగ్, హంగేరీకి చెందిన పన్నా ఉద్వార్డీ జోడీని ఓడించింది. భారత మహిళల టెన్నిస్‌లో గతంలోనూ పలువురు క్రీడాకారిణులు డబుల్స్‌లో రాణించినప్పటికీ.. ప్రధాన డబ్ల్యూటీఏ టూర్ స్థాయిలో పూర్తిస్థాయి భారత జోడీ ఫైనల్‌కు చేరడం ఇదే తొలిసారి. 2005లో శిఖా ఉబెరాయ్, నేహా ఉబెరాయ్ జంట సనోఫీస్ట్ ఓపెన్, గ్వాంగ్‌జౌ ఓపెన్ ఫైనళ్లకు చేరినా.. నేహా అమెరికా తరపున ప్రాతినిధ్యం వహించడంతో ఆ జోడీ ఇండో–అమెరికన్ జంటగా నిలిచింది. సానియా మీర్జా తన కెరీర్‌లో 43 డబుల్స్ టైటిళ్లు గెలిచినా.. భారత క్రీడాకారిణితో జతకట్టి ఆ విజయాలు సాధించలేదు. అంకిత రైనా, కర్మన్ థాండి 2018లో డబ్ల్యూటీఏ 125 స్థాయి డబుల్స్ టైటిల్ గెలిచారు.

సింగిల్స్‌లో తియన్, లినెట్ ఫైనల్‌కు

మహిళల సింగిల్స్ విభాగంలో టాప్ సీడ్, డిఫెండింగ్ ఛాంపియన్ జానిస్ తియన్ 6–3, 6–4తో అమెరికాకు చెందిన రాబిన్ మోంట్‌గోమరీని ఓడించి ఫైనల్‌కు చేరింది. మరో సెమీఫైనల్లో మూడో సీడ్ పోలాండ్ క్రీడాకారిణి మాగ్డా లినెట్ 2–6, 6–2, 6–3తో ఏడో సీడ్ రష్యా క్రీడాకారిణి అనస్తాసియా జఖరోవాపై విజయం సాధించింది.

ఐఓఏ ఎన్నికల బరిలో ఉష

• పురుషుల విభాగంలో గగన్, విజేందర్, యోగేశ్వర్ ఏకగ్రీవం • మహిళల నాలుగు స్థానాలకు ఆరుగురు పోటీ
• ఉషతో పాటు బరిలో సైనా నెహ్వాల్, అంజు బాబీ జార్జ్ • రేపు వర్చువల్ విధానంలో మహిళల ఎన్నిక

న్యూఢిల్లీ: భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) ఎన్నికల ప్రక్రియలో మహిళల విభాగంలో పోటీ అనివార్యమైంది. ప్రస్తుత అధ్యక్షురాలు పీటీ ఉషతో పాటు ఒలింపిక్ పతక విజేత సైనా నెహ్వాల్, అథ్లెటిక్స్ మాజీ స్టార్ అంజు బాబీ జార్జ్ సహా ఆరుగురు అభ్యర్థులు నాలుగు స్థానాల కోసం బరిలో నిలిచారు. మరోవైపు పురుషుల విభాగంలో ఒలింపిక్ పతక విజేతలు గగన్ నారంగ్, విజేందర్ సింగ్, యోగేశ్వర్ దత్‌తో పాటు మాజీ టేబుల్ టెన్నిస్ క్రీడాకారుడు కమలేశ్ మెహతా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు శనివారం ముగిసిన అనంతరం ఎన్నికల అధికారి సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఈ వివరాలు వెల్లడించారు. మహిళల విభాగానికి సోమవారం వర్చువల్ విధానంలో ఎన్నిక నిర్వహించనుండగా, పురుషుల విభాగంలో పోటీ లేకపోవడంతో ఎన్నిక అవసరం లేదని తెలిపారు. మహిళల నాలుగు స్పోర్ట్స్‌పర్సన్స్ ఆఫ్ మెరిట్ (ఎస్‌వోఎం) స్థానాల కోసం ఉష, సైనా, అంజు బాబీ జార్జ్‌తో పాటు మాజీ ఆర్చర్ డోలా బెనర్జీ, భారత మహిళల హాకీ జట్టు మాజీ కెప్టెన్ రాణి రాంపాల్, మాజీ బాస్కెట్‌బాల్ క్రీడాకారిణి అనితా పాల్‌దురై పోటీలో ఉన్నారు. వీరిలో నలుగురిని ఎన్నుకోనున్నారు.

ఐఓఏ కార్యవర్గంలోనూ చోటు

డిసెంబరు 5న జరగనున్న ఐఓఏ నూతన కార్యవర్గ ఎన్నికల నేపథ్యంలో ఈ ఎస్‌వోఎం స్థానాలకు ప్రాధాన్యం ఏర్పడింది. ఎన్నికైన ఎనిమిది మంది ఐఓఏ జనరల్ అసెంబ్లీలో సభ్యులుగా చేరడంతో పాటు ఓటు హక్కు పొందుతారు. నూతన కార్యవర్గ ఎన్నికల్లో పోటీ చేసే అర్హత కూడా లభిస్తుంది. వీరిలో ఒక పురుషుడు, ఒక మహిళ ఐఓఏ కార్యవర్గంలో సభ్యులవుతారు. 2022లో ఎస్‌వోఎంగా ఎన్నికైన ఉష అనంతరం ఐఓఏ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు.

ఒత్తిళ్ల ఆరోపణలు.. ఖండించిన క్రీడా శాఖ

నామినేషన్ల ఉపసంహరణ వెనుక క్రీడా మంత్రిత్వ శాఖ ఒత్తిడి ఉందని స్లీన్ స్పోర్ట్స్ ఇండియా మాజీ జాతీయ కన్వీనర్ బీవీపీ రావు ఆరోపించారు. మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన ఫోన్‌కాల్స్ కారణంగా కొందరు పోటీ నుంచి తప్పుకున్నారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలను క్రీడా శాఖ వర్గాలు ఖండించాయి. ఐఓఏ ఎన్నికలు స్వతంత్రంగా జరుగుతాయని, వాటిలో మంత్రిత్వ శాఖకు ఎలాంటి పాత్ర లేదని స్పష్టం చేశాయి. పురుషుల విభాగంలో పోటీ నుంచి తప్పుకున్న వారిలో అడిల్లె సుమరివాలా, అచంట శరత్ కమల్, బి.సాయిప్రణీత్, సతీశ్ కుమార్ శివలింగం, సురీందర్ సింగ్ షోకర్, రొంజన్ సోధీ, మాన్వేర్ సింగ్, మొరాద్ అలీ ఖాన్ ఉన్నారు. మహిళల విభాగంలో అశ్విని నాచప్ప, చెక్రోవోలు స్వురో, తృప్తి ముర్గుండే, నీలం సెట్టి లక్ష్మి, రజీనా కిరో నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. మొత్తం ఎనిమిది ఎస్‌వోఎం స్థానాల కోసం అక్టోబరు 31న 27 మంది అభ్యర్థుల పేర్లు ప్రకటించగా, నామినేషన్ల పరిశీలన అనంతరం ఆ సంఖ్య 23కు తగ్గింది. ఈ స్థానాలకు 80 మంది ఎస్‌వోఎంలు (40 మంది పురుషులు, 40 మంది మహిళలు) ఓటు వేయనున్నారు.



9న డీఎన్‌కే ట్రైలర్

'లిటిల్ హార్ట్స్' మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుని యూత్‌లో విపరీతమైన ఫాలోయింగ్ సంపాదించుకున్న యంగ్ హీరో మౌళి, ఇప్పుడు క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్ 'డిఎన్‌కె' తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థాయిలో నిర్మిస్తుండటం విశేషం. దీనివల్ల సినిమాపై మొదట్నుంచే అంచనాలు భారీగా నెలకొన్నాయి. శ్రీను కంబాల దర్శకత్వం వహించగా, మౌళి సరసన నుష్మిత శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రం నవంబర్ 13న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కాబోతుంది. ఇక విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో మేకర్స్ ప్రమోషన్స్‌లో జోరు మరింత పెంచారు. తాజాగా, సినిమాకు సంబంధించిన ట్రైలర్ అప్‌డేట్‌ను అధికారికంగా ప్రకటించి అభిమానులను ఉత్సాహపరిచారు. దీపావళిని 'డీఎన్‌కే' స్టైల్‌లో జరుపుకుందాం.. అంటూ నవంబర్ 9న ట్రైలర్‌తో బాంబు పేల్చబోతున్నాం అనే ఆసక్తికరమైన క్యాప్షన్‌తో మేకర్స్ కొత్త పోస్టర్‌ను వదిలారు. ఈ అనౌన్స్‌మెంట్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. మౌళి కామెడీ టైమింగ్, శ్రీను కంబాల టేకింగ్ ఈ సినిమాకు ప్రధాన బలంగా మారతాయని, థియేటర్లలో నవ్వుల వర్షం కురవడం ఖాయమని ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు.


సురేఖావాణి ఇన్‌స్టా హ్యాక్



టాలీవుడ్ నటి సురేఖా వాణి వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై ఆమె తీవ్రంగా స్పందించారు. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా హ్యాక్ అయిందని తెలిపారు. తన వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను అనుమతి లేకుండా కొందరు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారని ఆమె వెల్లడించారు. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో నోట్ పెట్టారు. మీమ్ పేజీలు, మీడియా సంస్థలు, యూట్యూబ్ ఛానళ్లు, వ్యక్తులు ఎవరైనా సరే.. తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆ కంటెంట్‌ను షేర్ చేయడం, రీపోస్ట్ చేయడం తక్షణమే ఆపాలని నటి విజ్ఞప్తి చేశారు. 'ఈ కంటెంట్‌ను షేర్ చేస్తున్న ఖాతాలు, వ్యక్తులను గుర్తించి, ఆధారాలను సేకరిస్తాను. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాను' అని హెచ్చరించారు. వ్యూస్, రీచ్, పబ్లిసిటీ కోసం.. ఈ పరిస్థితిని ఎవరూ తమకు అనుకూలంగా మార్చుకోవద్దని కోరారు. తన వ్యక్తిగత గోప్యతను గౌరవించాలని, ఇది చాలా తీవ్రమైన అంశమని ఆమె పేర్కొన్నారు. 2005లో ఇండస్ట్రీకి వచ్చిన సురేఖా వాణి.. ఆ తర్వాత వరుసగా హిట్ సినిమాల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్నారు.

శర్వా భోగి ట్రైలర్ వాయిదా

శర్వానంద్ హీరోగా, సంపత్ నంది దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'భోగి'. అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి కథానాయికలు. కెకె రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా.. నవంబరు 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో శనివారం ప్రీ రిలీజ్, ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ జరగనుందని మేకర్స్ ఇటీవల ప్రకటించారు. తాజాగా ఆ ఈవెంట్‌ను రద్దు చేస్తున్నట్లు తెలుపుతూ.. చిత్ర దర్శకుడు ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. కొన్ని కారణాల వల్ల ఈవెంట్‌ను వాయిదా వేసినట్లు ఆయన పేర్కొన్నారు. 'మీరంతా ఈ కార్యక్రమం కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నారని తెలుసు. కానీ, సాంకేతిక సమస్యల కారణంగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ని వాయిదా వేశాం. మిమ్మల్ని నిరాశ పరిచినందుకు చింతిస్తున్నాం. త్వరలోనే కొత్త తేదీని వెల్లడిస్తాం' అని ఆయన రాసుకొచ్చారు.





స్టైలిష్ లుక్‌లో చైతూ

అక్కినేని నాగచైతన్య కథానాయకుడిగా దర్శకుడు కార్తీక్ దండు తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'వృషకర్మ'. మైథలాజికల్ థ్రిల్లర్, అడ్వెంచర్ అంశాల కలయికతో రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. దీపావళి కానుకగా చిత్రబృందం తొలి లిరికల్ సాంగ్ 'స్వాగ్ ఆఫ్ అర్జున్'ను విడుదల చేసింది. నవంబర్ 7న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ పాటలో నాగచైతన్య సరికొత్త స్టైలిష్ లుక్‌లో ఆకట్టుకున్నారు. ఈ సినిమాలో అర్జున్ పాత్రలో కనిపించనున్న చైతన్య.. పాటలో తన యాటిట్యూడ్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిత్రానికి అజనీష్ బి.లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. 'కాంతార', 'విరూపాక్ష' చిత్రాలతో తనదైన సంగీతంతో ఆకట్టుకున్న ఆయన ఈ సినిమాకూ స్వరాలు సమకూరుస్తున్నారు. పాటకు అభినవకవి సాహిత్యం అందించారు. నాగచైతన్య సరసన మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తుండగా.. 'లాపతా లేడీస్' ఫేమ్ స్పర్శ్ శ్రీవాస్తవ ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. రగుల్ డి. హెరియన్ సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్, శ్రీ నాగేంద్ర తంగాల ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. భారీ సెట్లు, గుహల నేపథ్యంలో సాగే విజువల్ ఎపిసోడ్స్ సినిమాలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. బాపినీడు సమర్పణలో బీవీఎన్‌ఎన్ ప్రసాద్, సుకుమార్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



టాటా స్టీల్ లాభం రూ.3,700 కోట్లు

- రెండో త్రైమాసికంలో మెరుగైన ఆర్థిక ఫలితాలు
- భారత్ కార్యకలాపాల నుంచి మెరుగైన ఆదాయం
- 17 శాతం పెరిగిన ఈబీఐటీడీఏ
- రూ.65,436 కోట్లకు మొత్తం ఆదాయం

న్యూఢిల్లీ/ముంబై: టాటా స్టీల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో మెరుగైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. ఈ ఏడాది జులై–సెప్టెంబర్ త్రైమాసికంలో సంస్థ ఏకీకృత నికర లాభం గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 16 శాతానికిపై గా పెరిగి రూ.3,700 కోట్లకు చేరింది. 2025–26 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ.3,183 కోట్ల లాభాన్ని ఆర్జించింది. ప్రధానంగా భారత్‌లోని కార్యకలాపాల నుంచి మెరుగైన ఆదాయం రావడం ఈ వృద్ధికి దోహదపడింది. స మీక్షా త్రైమాసికంలో కంపెనీ ఆదాయం రూ.58,689 కోట్ల నుంచి రూ.65,436 కోట్లకు పెరిగింది. ఏకీకృత స్థూల నిర్వ హణ లాభం (ఈబీఐటీడీఏ) 17శాతం వృద్ధితో రూ.10,665 కోట్లకు చేరింది. ఈ త్రైమాసికంలో 80.7 లక్షల టన్నుల ఉ క్కును ఉత్పత్తి చేయగా, 79.2 లక్షల టన్నులను విక్రయిం చింది. గతేడాది ఇదే సమయంలో ఉత్పత్తి 77.3 లక్షల టన్ను లు, విక్రయాలు 79.1 లక్షల టన్నులుగా నమోదయ్యాయి.

భారత్ నుంచే కీలక ఆదాయం

టాటా స్టీల్ సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ టీవీ నరేంద్రన్ మాట్లాడుతూ.. భౌగోళిక, ఆర్థిక అనిశ్చితులు, ముడిసరుకుల ధరల పెరుగుదల ఉన్నప్పటికీ మెరుగైన సరఫరా వ్యవస్థ, వినియోగదారులతో సమన్వయం కారణంగా మంచి ఫలితాలు సాధించామని తెలిపారు. భారత్ తమ పనితీరుకు ప్రధాన చోదకశక్తిగా నిలిచిందన్నారు. సీజనల్‌గా డిమాండ్ కొంత తగ్గే త్రైమాసికమైనప్పటికీ, గత త్రైమాసికంతో పోలిస్తే భారత్‌లో ఉక్కు విక్రయాలు 16 శాతం పెరిగాయని పేర్కొన్నారు. భారత్‌లో కంపెనీ రూ.42,653 కోట్ల ఆదాయాన్ని, రూ. 10,634 కోట్ల ఈబీఐటీడీఏను నమోదు చేసింది. ఈబీఐటీడీఏ మార్జిన్ 25 శాతంగా ఉంది. ముడి ఉక్కు ఉత్పత్తి 7 శాతం పెరిగి 61.8 లక్షల టన్నులకు, విక్రయాలు 16 శాతం వృద్ధితో 59.8 లక్షల టన్నులకు చేరాయి.

బ్రిటన్ కార్యకలాపాల్లో నష్టం

నెదర్లాండ్స్‌లో 139.5 కోట్ల యూరోల ఆదాయం, 7.2 కోట్ల యూరోల ఈబీఐటీడీఏ నమోదైంది. ఆగస్టు ప్రారంభంలో డైరెక్ట్ షీట్ ప్లాంట్ తిరిగి ప్రారంభం కావడం దీనికి దోహదపడింది. బ్రిటన్‌లో 41.1 కోట్ల పౌండ్ల ఆదాయం వచ్చినప్పటికీ, రూ.56 కోట్ల పౌండ్లకు సమానమైన ఈబీఐటీడీఏ నష్టం నమోదైంది. (గమనిక: నష్టం 5.6 కోట్ల పౌండ్లు). అక్కడ విక్రయాలు 3.8 లక్షల టన్నులుగా ఉన్నాయి. సమీక్షా త్రైమాసికంలో మూలధన వ్యయాల కోసం రూ.3,280 కోట్లు ఖర్చు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో ఈ వ్యయం రూ.6,860 కోట్లుగా ఉంది. నీలాచల్ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్‌లో 48 లక్షల టన్నుల సామర్థ్య విస్తరణతో పాటు ఇతర విస్తరణ ప్రాజెక్టులను చేపడుతోంది. సెప్టెంబర్ చివరికి కంపెనీ నికర రుణ భారం రూ.91,423 కోట్లుగా ఉండగా, నికర రుణం–ఈబీఐటీడీఏ నిష్పత్తి 2.4 రెట్లుగా నమోదైంది. నగదు, నగదు సమాన నిల్వలతో కలిపి గ్రూప్ లిక్విడిటీ రూ.40,076 కోట్లుగా ఉంది.

టాటా కెమికల్స్‌కు రూ.50 కోట్ల నష్టం

టాటా గ్రూప్‌నకు చెందిన టాటా కెమికల్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో నష్టాలను నమోదు చేసింది. 2026 సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికి ఏకీకృత ప్రాతిపదికన రూ.50 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో రూ.154 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. సోడా యాష్ ధరలు తగ్గడం, ఇంధనం, రవాణా వ్యయాలు పెరగడం, ఇతర ఆదాయం తగ్గడం, జాయింట్ వెంచర్ల నుంచి వచ్చే ఆదాయం క్షీణించడం ఫలితాలపై ప్రభావం చూపాయి. అయితే సమీక్షా త్రైమాసికంలో కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం 8 శాతం పెరిగి రూ.4,177 కోట్లకు చేరింది. గతేడాది ఇదే సమయంలో ఇది రూ.3,877 కోట్లుగా ఉంది. భారత్, అమెరికాలో విక్రయ పరిమాణాలు పెరగడం, భారత్‌లో మెరుగైన ధరలు లభించడం ఆదాయ వృద్ధికి తోడ్పడ్డాయి. కెన్యాలో కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేయడం కూడా ఆదాయ గణాంకాలపై ప్రభావం చూపింది.



ఇంధనం, రవాణా ఖర్చుల ప్రభావం

టాటా కెమికల్స్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో ఆర్.ముకుందన్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ ఉత్పత్తి, విక్రయ పరిమాణాలను పెంచడంతో పాటు నిర్వహణ సామర్థ్యాన్ని మెరుగుపరిచామని తెలిపారు. ఖర్చుల నియంత్రణ చర్యలతో ప్రతికూల పరిస్థితుల ప్రభావాన్ని కొంతమేర తగ్గించగలిగామని పేర్కొన్నారు. అయితే సోడా యాష్ ధరలపై ఒత్తిడి కొనసాగుతోందని, ముడిసరుకులు, ఇంధనం, రవాణా వ్యయాలు అధికంగా ఉండటం సవాలుగా మారిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా సోడా యాష్ సరఫరా అధికంగా ఉండటం, డిమాండ్ మందగించడం, అంతర్జాతీయ వాణిజ్య మార్గాల్లో మార్పులు చోటుచేసుకోవడం వల్ల ధరలు తగ్గుతున్నాయని వివరించారు. ముఖ్యంగా అమెరికా నుంచి ఆగ్నేయాసియా దేశాలకు ఎగుమతులు లాభదాయకమైనా ధరల కారణంగా ప్రభావితమయ్యాయని తెలిపారు.

పెరిగిన వ్యయాలు

మధ్యప్రాచ్యంలో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న సంఘర్షణ కారణంగా సున్నపురాయి, కార్బన్ డయాక్సైడ్ వంటి కీలక ముడిసరుకులతో పాటు ఇంధనం, సరుకు రవాణా, లాజిస్టిక్స్ వ్యయాలు పెరిగాయని ముకుందన్ పేర్కొన్నారు. బ్రిటన్‌లో సహజ వాయువు ధరలు గణనీయంగా పెరగడం కూడా ఏకీకృత ఫలితాలపై ప్రతికూల ప్రభావం చూపిందన్నారు. స్వల్పకాలంలో అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు సవాలుగానే ఉండే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

క్యాన్సర్ చికిత్సలకు రూ.780 కోట్ల బీమా చెల్లింపు

- ఆరు నెలల్లో 85,900కుపైగా క్లెయిమ్‌ల పరిష్కారం
- బాధితుల్లో 60 శాతం మంది మహిళలే
- మహిళల క్లెయిమ్‌ల చెల్లింపుల్లో 17 శాతం వృద్ధి
- స్క్రీనింగ్‌తో పాటు ఆర్థిక భద్రతా అవసరంపై స్టార్ హెల్త్ దృష్టి

చెన్నై: క్యాన్సర్ చికిత్సలో ఆరోగ్య బీమా ప్రాధాన్యం పెరుగుతోందని స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ వెల్లడించింది. 2026–27 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో (ఏప్రిల్–సెప్టెంబర్) క్యాన్సర్‌కు సంబంధించి 85,900కుపైగా క్లెయిమ్‌లను పరిష్కరించి, రూ.780 కోట్లకు పైగా చెల్లించినట్లు తెలిపింది. వీటిలో 60 శాతం క్లెయిమ్‌లు మహిళలకు సంబంధించినవే. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే మహిళలకు చేసిన చెల్లింపులు 17 శాతం పెరిగాయి. మొత్తం క్లెయిమ్‌లలో 30 శాతం 51–60 ఏళ్ల వయసు వారివి కాగా, చెల్లింపుల్లో 45 శాతానికిపైగా మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు నుంచి నమోదయ్యాయి. భారత్‌లో మహిళలకు రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ల ముప్పు అధికంగా ఉందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఐసీఎంఆర్ గణాంకాల ఆధారంగా 2013లో ప్రచురితమైన ఓ అధ్యయనం.. 2026లో మహిళలకు సుమారు 9.35 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతాయని అంచనా వేసింది. ఇది అప్పటి అంచనా మాత్రమే. మరోవైపు, 2026 ఫిబ్రవరి నాటికి దేశవ్యాప్తంగా 8.73 కోట్ల మంది మహిళలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించగా, 93,062 మందిలో వ్యాధిని గుర్తించినట్లు కేంద్రం వెల్లడించింది.

కుటుంబంపైనా ఆర్థిక, మానసిక భారం

క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తించడంతో పాటు చికిత్సకు అవసరమైన ఆర్థిక భరోసా కల్పించడం కూడా కీలకమని స్టార్ హెల్త్ పూర్తి కాల డైరెక్టర్, సీఓఓ అమితాబ్ జైన్ పేర్కొన్నారు. క్యాన్సర్ చికిత్స రోగితో పాటు కుటుంబంపైనా ఆర్థిక, మానసిక భారం మోపుతుందని శస్త్రచికిత్స క్యాన్సర్ నిపుణుడు ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రాజసుందరం తెలిపారు. కీమోథెరపీ, రేడియేషన్, శస్త్రచికిత్స, దీర్ఘకాలిక పర్యవేక్షణకు భారీ వ్యయం అవుతుందని, ఆర్థిక ఇబ్బందులతో చికిత్స వాయిదా పడటం లేదా మధ్యలో ఆగిపోవడం ప్రమాదకరమని హెచ్చరించారు. అందువల్ల ముందస్తు పరీక్షలతో పాటు చికిత్సకు అంతరాయం లేకుండా కొనసాగించేందుకు ఆరోగ్య బీమా, ఆర్థిక ప్రణాళిక అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.



భారత్‌లో వేగంగా విస్తరిస్తున్న ఏఐ

- వ్యయం, నైపుణ్యాలు, మౌలిక సదుపాయాలే ప్రధాన సవాళ్లు
- ఒరాకిల్ ఇండియా హెడ్ శైలేంద్ర కుమార్ వెల్లడి

లాస్‌వేగాస్: కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంలో భారత్ వేగంగా పురోగమిస్తోందని ఒరాకిల్ ఇండియా హెడ్ శైలేంద్ర కుమార్ తెలిపారు. దేశీయ సంస్థలు ఏఐని ప్రయోగాత్మకంగా పరీక్షించే దశను దాటి, వ్యాపార కార్యకలాపాల్లో పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నాయని చెప్పారు. దీని ద్వారా సమయం, ఖర్చు ఆదాతో పాటు పనితీరులోనూ మెరుగుదల కనిపిస్తోందన్నారు. అయితే వ్యయం, నైపుణ్యాల కొరత, మౌలిక సదుపాయాల కల్పన ప్రధాన సవాళ్లుగా ఉన్నాయని పేర్కొన్నారు. లాస్‌వేగాస్‌లో జరుగుతున్న ఒరాకిల్ ఏఐ వరల్డ్–2026 సదస్సు సందర్భంగా పీటీఐతో మాట్లాడారు. ఏఐ అమలుకు ముందు సంస్థలు దాని వల్ల కలిగే ప్రయోజనాలను అంచనా వేస్తున్నాయని, భద్రత, పనితీరుపై గతంలో ఉన్న సందేహాలు తగ్గడంతో స్వీకరణ వేగవంతమైందని వివరించారు.

ప్రభుత్వాలతో కలిసి శిక్షణ కార్యక్రమాలు

నైపుణ్యాల అభివృద్ధికి విశ్వవిద్యాలయాలు, రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి ఒరాకిల్ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులకూ శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. కొత్త డేటా కేంద్రాల ఏర్పాటుతో మౌలిక సదుపాయాల సమస్య క్రమంగా తగ్గుతోందన్నారు. ఏఐ వ్యవస్థల నిర్ణయాలపై మానవ పర్యవేక్షణ తప్పనిసరని శైలేంద్ర కుమార్ స్పష్టం చేశారు. అవి నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తున్నాయో లేదో పరిశీలించేందుకు సంస్థల్లో ప్రత్యేక నిపుణులు ఉండాలని సూచించారు. ఏఐ మోడళ్ల నియంత్రణ, పర్యవేక్షణకు అనుగుణంగా నిబంధనలు కూడా అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. భారత్‌లో 33ఏళ్లుగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఒరాకిల్ 15కు పైగా నగరాలకు విస్తరించిందని, గత దశాబ్దంగా రెండంకెల వృద్ధిని నమోదు చేస్తోందని వెల్లడించారు. దేశంలో బ్యాంకింగ్ తమ అతిపెద్ద వ్యాపార విభాగమని, ఆ తర్వాత ప్రభుత్వ రంగం ఉందని చెప్పారు. నాలుగు టెలికాం ఆపరేటర్లూ తమ సేవలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. రాబోయే మూడేళ్ల నుంచి ఐదేళ్లలో వ్యాపార వృద్ధిని మరింత వేగవంతం చేయడమే లక్ష్యమని, అంతర్జాతీయ అనిశ్చితుల మధ్యనూ భారత ఆర్థిక పరిస్థితులు, మార్కెట్ అవకాశాలు ఆశాజనకంగా ఉన్నాయన్నారు.

Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. **RNI NO: TELTEL/2023/87657**